ఆంధ్రజ్యోతి


గరిష్ఠం 30.5
కనిష్ఠం 23.8

ANDHRAJYOTHY

నల్లగొండ

5

శనివారం 6 సెప్టెంబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.90 (308.7614)	52,360	52,360
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.90 (4.17)	2,426.7	1,290.06
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.292 (43.1584)	35,800	17,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.132 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220





నల్లగొండ పట్టణం వల్లభరావు చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



బైబై గణేషా

అట్టహాసంగా నిమజ్జన శోభాయాత్ర

నల్లగొండ కల్చరల్ , సెప్టెంబరు 5: నవరాత్రుల పాటు పూజలందుకున్న గణేష్ విగ్రహాలను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అట్టహాసంగా శోభాయాత్రలు నిర్వహించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. అందంగా అలంకరించిన వాహనాలపై విగ్రహాలను ప్రతిష్ఠించి ఊరేగింపు నిర్వహించారు. శోభా యాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జై గణేషా.. జైజై గణేషా.. నినాదాలు, భజనలతో అంతటా భక్తిభావం వెల్లివిరిసిం ది. కళాకారుల వేషాధారణలు, నృత్యాలు, భక్తి పాటలు, కోలాటాలు, బాణాసంచా పేలుళ్ల మధ్య శోభాయాత్ర సాగింది. అర్ధరాత్రి దాటేవరకు విగ్రహాల నిమజ్జనం కొనసాగింది. నల్లగొండ పట్టణంలో వల్లభరావు చెరువలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

మత సామరస్యాన్ని కొనసాగిద్దాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండలో 1వ నెంబర్ విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో గంగా, జమునా, తెహజీబ్ సంస్కృతి, మత సామరస్యాన్ని కొనసాగిద్దామని, గత 30 ఏళ్లుగా ఎలాంటి ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు, నిమజ్జనం నిర్వహించుకోవడం సంప్రదాయంగా కొనసాగిస్తున్నామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ ఏడాది కూడా అదేరీతిలో శాంతియుతంగా శోభాయాత్రను కొనసాగించాలని, ప్రత్యేకించి యువత ఎక్కడా అత్యుత్సాహం ప్రదర్శించవద్దని కోరారు. గణేష్ నవరాత్రుల ముగింపు, శోభాయాత్ర ప్రారంభం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాతపట్టణం హనుమాన్ కాలనీలో ఏర్పాటు చేసిన 1వ నెంబర్ గణేష్ మండపం వద్ద వినాయక విగ్రహానికి నిర్వహించిన పూజల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలో మతసామరస్యం విలసిల్లుతోందని, అన్ని మతాలను పరస్పరం గౌరవించుకుంటూ అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. ఈ ఏడాది వినాయక మండపాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్‌ను అందించిందన్నారు. రూ.200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని ప్రారంభించామని, లతీఫ్ సాహెబ్ దర్గా గుట్ట, బ్రహ్మంగారి గుట్టలకు రూ.150కోట్లతో ఘాట్ రోడ్లు నిర్మిస్తున్నామని, 30శాతం పనులు కూడా పూర్తయ్యాయన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ అన్ని శాఖల సిబ్బంది, గణేష్ ఉత్సవ కమిటీల సహకారంతో క్రమశిక్షణను...

- మిగతా 8వ పేజీలో...

సొరంగం తవ్వకానికి గ్రీన్‌సిగ్నల్

- ఎస్‌ఎల్‌బీసీ పనులకు డెడ్‌లైన్ 2027
- సమీక్షలో సీఎం, మంత్రి నిర్ణయం
- అన్ని అనుమతుల కోసం ప్రత్యేక క్యాబినెట్ సమావేశం
- ఇన్‌లెట్ వైపు డీబీఎం పద్ధతిలో, అవుట్‌లెట్ వైపు టీబీఎం పద్ధతిలో పనులు

నల్లగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాకు జీవనరేఖగా పేర్కొంటున్న ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గం పనులను 2027, డిసెంబరు 9వ తేదీలోగా పూర్తిచేయాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. ఇన్‌లెట్ వైపు (శ్రీశైలం నుంచి నీరు తీసుకునే ప్రాంతం) పనులు పునః ప్రారంభించాక ఈ ఏడాది ఫిబ్రవరి 22న 14వ కిలోమీటర్ ప్రాంతంలో సొరంగం కుప్పకూలింది. దీంతో అప్పటినుంచి పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో పనులను తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా అత్యాధునిక హెలీబోర్న్ సర్వే నిర్వహించడం ద్వారా భవిష్యత్‌లో సొరంగ పనుల సందర్భంలో ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ పనులను 24 గంటలు కొనసాగించాలని నిర్ణయించారు. గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు నిర్ణయించారు. పనుల పర్యవేక్షణ, సొరంగమార్గం పూర్తికి తీసుకోవాల్సిన చర్యలను సూచించే నిమిత్తం మాజీ ఆర్మీ అధికారి, లెఫ్టినెంట్ జనరల్ హర్పాల్‌సింగ్‌ను నీటిపారుదలశాఖ ప్రత్యేక సలహాదారుగా నియమించారు. సొరంగమార్గం పూర్తిచేసే క్రమంలో శ్రీశైలం నుంచి అక్కంపల్లి రిజర్వాయర్ వరకు ఉన్న ఇతర సమస్యలన్నింటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల కోసం వారం రోజుల్లో ప్రత్యేక క్యాబినెట్ సమావేశం నిర్వహించి అన్ని అనుమతులు తీసుకోవాలని సైతం నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు కేవలం నల్లగొండ జిల్లాకే కాదని, యావత్ రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మకమని ఈ సందర్భంగా సీఎం వ్యాఖ్యానించడం ప్రాజెక్టు పనుల పునరుద్ధరణపై ప్రభుత్వం పట్టుదలగా ఉందని తెలుస్తోంది.

అవుట్‌లెట్ వైపు 3.545 కిలోమీటర్లు

మన్నేవారిపల్లి నుంచి (నీరు విడుదలయ్యే వైపు) చేపట్టిన అవుట్‌లెట్ టన్నెల్ 23.980 కిలోమీటర్లకు 20.435 కిలోమీటర్లు పూర్తవగా, ఇంకా 3.545 కిలోమీటర్లు మాత్రమే తవ్వాల్సి ఉంది. ఈ పనులను టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) ద్వారానే చేపట్టాలని నిర్ణయించారు. ఈ యంత్రం ఎలాంటి ఆటంకాలు లేకుండా పనిచేస్తే ఏడాది కాలంలో అవుట్‌లెట్ సొరంగం పనులు పూర్తిచేయవచ్చని ఎస్‌ఎల్‌బీసీ ఇంజనీర్లు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ యంత్రం ఆగడానికి కారణమైన 7మీటర్ల వ్యాసం, 37 మెట్రిక్ టన్నుల బరువు ఉండే బేరింగ్‌ను అమెరికా నుంచి తెప్పించారు. ఏడాది క్రితం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ బేరింగ్ తయారీ కంపెనీ ఉన్న అమెరికాకు వెళ్లి, బేరింగ్, ఇతర పరికరాలకు ఆర్డర్ కోసం రాబిన్‌సన్ కంపెనీతో అగ్రిమెంట్ చేయించారు. ఈ బేరింగ్ ఇప్పటికే పనిప్రదేశానికి చేరగా, ఇతర ఇన్‌స్టాలేషన్‌కు అవసరమైన సామగ్రి తెప్పించడానికి అవసరమైన నిధులు లేక బేరింగ్ ఇన్‌స్టాలేషన్ నిలిచింది.

ఈ వారంలో జరిగే క్యాబినెట్ సమావేశంలో ఈ సామగ్రి కొనుగోలుకు సైతం అనుమతులు తీసుకుంటారని, తద్వారా అవుట్‌లెట్ పనులను యుద్ధప్రాతిపదికన కొనసాగించేందుకు వీలవుతుందని అధికారులు చెబుతున్నారు.



క్యాబినెట్ సమావేశం ముగిశాక పనుల పునరుద్ధరణ

ఈ వారంలో నిర్వహించే క్యాబినెట్ సమావేశం ముగిసిన వెంటనే ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గం పనులను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించారు. ప్రమాదం జరిగిన ఇన్‌లెట్ వైపు డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇక్కడ మళ్లీ ప్రమాదం జరగకుండా నేషనల్ జియోగ్రాఫిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో అత్యాధునిక హెలీబోర్న్ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సర్వేతో ప్రమాదం జరిగే అవకాశముంటే ముందుగానే సంకేతాలు వస్తాయని, తద్వారా ముందస్తు చర్యలు తీసుకుంటూ పనులు వేగవంతంగా కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని ఇంజనీర్లు చెబుతున్నారు. ఇన్‌లెట్‌వైపు మొత్తం 19.500కిలోమీటర్ల టన్నెల్ తవ్వాల్సి ఉండగా, 13.935 కిలోమీటర్లు పూర్తయింది. ఫిబ్రవరిలో అక్కడి నుంచి పనులు తిరిగి ప్రారంభించగానే టన్నెల్ కుప్పకూలింది. 2019 నుంచి ఇక్కడ ఊటనీరు వచ్చిచేరుతుండడంతో పాటు, పనులు చేస్తున్నప్పుడు మట్టి, రాళ్లు కూలుతుండడంతో ముందుకు సాగలేదు. ఊటనీటిని తోడివేస్తూ, మట్టిని తొలగించడంతో పాటు, ఊటనీరు మళ్లీ రాకుండా, మట్టి, రాళ్లు పడకుండా ఉండేలా సిమెంట్, పాలియేరిథిన్‌తో గ్రౌటింగ్ చేయించారు. గ్రౌంటింగ్ చేస్తున్నప్పటికీ అది కప్పును బలంగా ఉంచలేకపోయిందని అందువల్లే టన్నెల్ కూలిందని

మిగతా 8వ పేజీలో...

దేశాన్ని తీర్చిదిద్దడంలో

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురువు గొప్పదనాన్ని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి చాటిచెప్పారని, ఆయన సేవలు మరువలేనివని అన్నారు. విద్యావ్యవస్థను పటిష్ఠం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర విద్యార్థులు ప్రపంచంతో పోటీపడేలా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోందన్నారు. నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ మాట్లాడుతూ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించేది గురువులేనని, అలాంటి గురువులు సమాజానికి ఆదర్శనీయులని కొనియాడారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, తాను కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న వెంటనే ప్రారంభమైన ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర మర్చిపోలేనిదని, అందుకు ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలని తెలిపారు. జిల్లాలో విద్యాభివృద్ధికి మైనింగ్ ద్వారా వచ్చే నిధుల్లో 70శాతం కేటాయించాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల అంకితభావంతోనే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ అవార్డులతో నిమిత్తం లేకుండా ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్‌పై దృష్టిసారించాలన్నారు. అనంతరం జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన 208 మందిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు ఎస్పీ రమేష్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, డీఈవో భిక్షపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ హఫీజ్‌ఖాన్, హాలియా మార్కెట్‌కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై మంత్రి అసహనం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి ప్రసంగం ప్రారంభానికి ముందే ఉపాధ్యాయుల్లో సగం మందికి పైగా డైనింగ్ హాల్‌కు వెళ్లడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటన తనకు బాధ కలిగించిందని, ఎంపీ మాట్లాడిన తర్వాత తాను మాట్లాడతానని తెలిసినా, 50శాతం మందికిపైగా డైనింగ్ హాల్‌లో ఉండడం మనమంతా ఏ పరిస్థితిలో ఉన్నామో ఆలోచించుకోవాలన్నారు. కార్యక్రమం నుంచి తాను వెళ్లిపోయి ఉంటే తన గౌరవం పెరిగేదని, ఉపాధ్యాయుల గౌరవం తగ్గేదని, కానీ తాను అలా వెళ్లకుండా, యావత్ తెలంగాణ ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడానని పేర్కొన్నారు. అయితే అప్పటికే కార్యక్రమం జాప్యమవడంతో షుగర్, బీపీ వంటి సమస్యలతో బాధపడుతున్న వారు భోజనాలకు వెళ్లారే తప్ప, మంత్రిపై అగౌరవంతో కాదని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

మానవ సేవలో తరించిన మదర్ థెరిస్సా: మానవ సేవ కన్నా మిన్న ఏదీ లేదని చాటిన మహిళ మదర్ థెరిస్సా అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మదర్ థెరిస్సా వర్థంతి సందర్భంగా మంత్రి క్యాంపు కార్యాలయం, ఇందిరా భవన్‌లో మదర్ థెరిస్సా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి

విజయ డెయిరీ

లాభాల్లోకి రావడం అభినందనీయం

నల్లగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ నెల రూ.10కోట్ల నష్టాల్లో ఉన్న విజయ డెయిరీని ఆ సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ఏడాది కాలంలోనే లాభాల బాటలోకి తీసుకరావడం అభినందనీయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా గుత్తా అమిత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా సీఎంను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మరింత పట్టుదలతో పనిచేసి వచ్చిన లాభాలను పాడి రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం అమిత్‌రెడ్డి మాట్లాడుతూ, మరో ఏడాది కాలంలో విజయ డెయిరీ అమ్మకాలను పెంచి సమాఖ్యను పూర్తి లాభాల్లోకి తీసుకువస్తానని, అందుకు ప్రణాళికతో పనిచేస్తానన్నారు.

588.90 అడుగుల వద్ద సాగర్ నీటిమట్టం




నాగార్జునసాగర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం శుక్రవారం సాయంత్రం 588.90 అడుగులకు చేరింది. సాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 588.90 అడుగులు (308.7614 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 9,500 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 6,949 క్యూసెక్కుల నీటిని, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,211 క్యూసెక్కుల నీటిని, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌నుంచి మొత్తం 52,360 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 52,360 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

నిలకడగా మూసీకి ఇన్‌ఫ్లో

(ఆంధ్రజ్యోతి, కేతేపల్లి): మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల పరిధితోపాటు ఎగువ మూసీ నదీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో 10రోజులుగా ప్రాజెక్టుకు కొనసాగిన ఇన్‌ఫ్లో శుక్రవారం సాధారణ స్థితికి చేరింది. దీంతో ప్రాజెక్టు నాలుగు క్రస్టుగేట్లు ఎత్తి వరద నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్న అధికారులు శుక్రవారం ఒక క్రస్టుగేటును అడుగు మేర మాత్రమే ఎత్తి 770.71 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 2426.72 క్యూసెక్కులుగా నమోదైంది. వర్షాలు తగ్గుముఖం పట్టి ఇన్‌ఫ్లో పడిపోతున్న నేపథ్యంలో ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో అధికారులు ప్రాజెక్టు నీటిమట్టాన్ని క్రమంగా 645అడుగుల గరిష్ఠ స్థాయికి చేర్చే యత్నాలు చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 459.13 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645 అడుగు (4.46టీఎంసీ)ల నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.90అడుగు (4.17టీఎంసీ)లుగా ఉంది.

హైదరాబాద్ తరలిన జేపీవోలు




బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామపాలన అధికారులుగా ఎంపికైన జిల్లాకు చెందిన అభ్యర్థులు శుక్రవారం హైదరాబాద్‌కు తరలారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నుంచి నియామక పత్రాలు అందుకునేందుకు మూడు బస్సుల్లో వెళ్లారు. ఈ బస్సులకు ఎన్జీ కళాశాల మైదానంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేపీవోలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్ పరుశరాములు, తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాలను అభివృద్ధి చేయాలి

మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి

తిప్పర్తి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాల్లో అభివృద్ధి జరగాలని మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. శుక్రవారం తిప్పర్తి మండల పరిధిలోని రామలింగాలగూడెం గ్రామంలో భక్త మార్కండేయస్వామి దేవస్థానం గుట్ట మెట్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహాశివరాత్రి సందర్భంగా దేవాలయాన్ని దర్శించుకున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని గుట్ట మెట్లకు సహకరించాలని స్థానిక నాయకులు విన్నవించారన్నారు. ఈ మేరకు మెట్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. హామీ మేరకు పనులు ప్రారంభించినట్టు చెప్పారు. అదేవిధంగా తన వంతుగా రూ.50వేలు దేవాలయ చైర్మన్‌కు అందజేశారు. కార్యక్రమంలో నల్లగొండ మార్కెట్‌కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, ముత్తినేని శ్యాంసుందర్, చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, సుధీర్, అంజయ్య, పాదూరి శ్రీనివాస్‌రెడ్డి, సత్యానారాయణ, మోష, రొట్టెల రమేష్, పాల్గొన్నారు.



మెట్ల పనులను ప్రారంభిస్తున్న పాశం రాంరెడ్డి




మరణానంతరం 'చూపు'

» ఒకరి నేత్రదానంతో ఇద్దరికి చూపు » ఈ నెల 8 వరకు నేత్రదాన అవగాహన పక్షోత్సవాలు

కంటి చూపు ఆధారంగానే మన జీవనశైలి ఆధారపడి ఉంటుంది. దానాలలో విశిష్టమైనది నేత్రదానం. మరణానంతరం ఒకరు చేసే నేత్రదానం ఇద్దరికి చూపును ప్రసాదిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రతీ ఏడాది ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ 15 రోజుల పాటు పలు అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తూ నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నారు. ఆ ప్రయత్నాలు ఇంకా పెరగాల్సి ఉంది.

\- (ఆంధ్రజ్యోతి-భువనగిరిటౌన్)



నిత్యజీవితంలో కంటి చూపు కీలకమైనది, సున్నితమైనది కూడా. శరీరంలోని జ్ఞానేంద్రియాల్లో కళ్లు అత్యంత ప్రాధాన్యమైనవి. కంటిచూపు ఉంటేనే పనులన్నింటినీ చక్కబెట్టగలం. ఆపద నుంచి తప్పించుకోగలం. దీంతో కంటి భద్రతకు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాల్సిందే. కంటిలో ఏ చిన్నపాటి సమస్య వచ్చినా సొంత వైద్యానికి పోకుండా నేత్రవైద్యులను కలవాలి. 40 ఏళ్లు దాటిన వారు ప్రతి ఆరు నెలలకు నేత్ర పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే వయసుతో నిమిత్తం లేకుండానే చూపు సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే వైద్యులను సంప్రదించాలి. సుగర్, బీపీ తదితర రుగ్మతలు ఉన్నవారిలో త్వరగా కంటి చూపుపై ప్రభావం చూపుతాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రతి ఒక్కరూ కంటి అద్దాలను ధరించాలి. వేసవిలో కూలింగ్ గ్లాసెస్ ధరించడం మంచిది. లేనిపక్షంలో రోడ్డు వెంట వెలువడే దుమ్ము కళ్లలోకి చేరి చూపుపై ప్రభావం చూపుతుంది.

పిల్లలపై తీవ్రప్రభావం

నేటి ఆధునిక కాలంలో కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్ వినియోగం తప్పనిసరి అవుతోంది. దీంతో గంటల తరబడి ఆ రెండింటిని చూస్తుండటంతో చూపు సమస్యలు పెరుగుతున్నాయి. నేత్రవైద్యులను సంప్రదిస్తున్న వారిలో ఈ రెండు కేటగిరీలకు చెందిన వారే అధికంగా ఉంటున్నారు. పలువురు తల్లిదండ్రులు ముఖ్యంగా తల్లులు పిల్లల చికాకులు భరించలేక స్మార్ట్‌ఫోన్లు ఇస్తుండటం వారి భవిష్యత్ ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతోంది. ఏకధాటిగా ఫోన్లను చూస్తున్న పిల్లల్లో మాటలు ఆలస్యంగా రావడం, మెడ నరాలు బిగుసుకుపోవడం, కంటి చూపు మందగించడం, తదితర ఇబ్బందులు వస్తున్నాయి.

20 నిమిషాలకు 20 సెకన్లు

కంప్యూటర్ ముందు ఉద్యోగం చేసే టెకీలతో పాటు మిగతా ఉద్యోగులు కూడా ప్రతీ 20 నిమిషాలకు కనీసం 20 సెకండ్ల పాటు దృష్టి మరల్చడం లేదా కళ్లు మూసుకోవడం చేయాలి. తప్పనిసరి అయితేనే స్మార్ట్ ఫోన్‌ను చూడాలి. అయితే ఈ రెండింటినీ మన కళ్లకు కనీసం అడుగు దూరంతో నిటారుగా చూసేలా జాగ్రత్తలు తీసుకోవాలి. కనీసం మూడు మీటర్ల దూరంతో టీవీ చూస్తే కళ్లకు మంచిది. అలాగే రసాయనాలు, అధిక వేడి, మంటలు, తీవ్రగాలులు తదితర ప్రమాదకర పరిస్థితులతో కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి. వైద్యులు సూచించే అద్దాలను వినియోగించడం విస్మరించవద్దు. రీడింగ్ గ్లాసెస్ కొనే ముందు కూడా కంటి పరీక్షలు చేయించుకుంటే మేలని వైద్యులు సూచిస్తున్నారు.

నేత్రదానం మహాదానం

మరణానంతరం చేసే నేత్రదానం ఇద్దరికి కంటి చూపును ప్రసాదిస్తుంది. దీంతో మృతుల పార్థివదేహం నుంచి నేత్రాలను దానం చేసేందుకు సంబంధిత కుటుంబసభ్యులు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. పలువురు ఉద్యమకారుల, సామాజికవేత్తల మృతదేహాలను వారి కుటుంబ సభ్యులు వైద్య కళాశాలలకు అప్పగిస్తున్న ఘటనలను అందరూ నేత్రదానం పట్ల స్ఫూర్తిగా తీసుకోవాలని వైద్యులు అంటున్నారు. స్వచ్ఛంద రక్తదాన శిబిరాల మాదిరిగానే నేత్రదాన ప్రతిజ్ఞ పత్రాల అందజేతకు శిబిరాలు నిర్వహించాల్సి ఉందని నేత్ర నిపుణులు పేర్కొంటున్నారు.

మరణించిన ఎనిమిది గంటల్లోపే

మరణానంతరం 6 నుంచి 8 గంటలలోపు నేత్రదానం చేయవచ్చు. ఫ్రీజర్ బాక్స్‌లో ఉంచిన మృతదేహాల నుంచి 12 నుంచి 15 గంటల్లోపు నేత్రాలను సేకరించవచ్చు. అయితే నేత్రదానం అంటే కేవలం నల్లగుడ్డుపై పొర(కార్నియా) మాత్రమే సేకరిస్తారు. కార్నియా సేకరణ అనంతరం పార్థివ మృతదేహంలో కళ్లు యథావిధిగానే ఉంటాయి. సేకరించిన కార్నియాను 24గంటల్లో అవసరమైన వారికి అమరుస్తారు. నేత్రదానంతో కార్నియా సేకరించిన, అమర్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారు. 94 ఏళ్ల వయసు వరకు మరణానంతరం నేత్రదానం చేయవచ్చు. హైదరాబాద్ ఆస్పత్రులలో మృతి చెందితే అక్కడే నేత్రదానం చేయవచ్చు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో మృతిచెందిన కుటుంబసభ్యులు నేత్రదానం కోసం నల్లగొండ, మిర్యాలగూడ కేంద్రంగా పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలను సంప్రదించవచ్చు. చూపును ప్రసాదించే కళ్ల కోసం బాధితులు హైదరాబాద్‌లోని సరోజినీదేవి, ఎల్వీ ప్రసాద్, ఇకోస్ ఆస్పత్రులలో పేర్లు నమోదు చేసుకోవాలి. సీనియార్టీ, అర్హతల ఆధారంగా ఎంపిక చేస్తారు. పిల్లలకు, యువకులకు, రెండు కళ్లలో చూపులేని వారికి తొలి ప్రాధాన్యం ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రిలో నేత్ర శస్త్రచికిత్సలు జరగడం లేదు. ఐ బ్యాంకులు లేవు. అలాగే నేత్రదానంపై అవగాహన కార్యక్రమాలు చాల తక్కువ. దీంతో తప్పనిసరి పరిస్థితులలో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న సందర్భం, అయితే లయన్స్ క్లబ్ విశేష రీతిలో సేవలు అందిస్తోంది. మిర్యాలగూడలో 2022లో లయన్స్ ఇంటర్నేషన్ డైమండ్ నేత్ర నిధి ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు 220 మంది మరణానంతరం కార్నియాను సేకరించి 440 మందికి చూపును ప్రసాదించారు. నేత్రదానం కోసం సెల్‌ఫోన్ 9866017777, 9866230018ను సంప్రదించాలని సూచిస్తున్నారు. అలాగే నల్లగొండలో ఎనిమిది నెలల కిందట లైన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) సంయుక్తంగా ఐ డొనేషన్ సెంటర్(ఈఆర్‌సీ)ఏర్పాటు చేసి ఇప్పటివరకు 186మంది పార్థివదేహాల నుంచి కార్నియాను సేకరించి 372మందికి చూపు ప్రసాదించారు. ఈమేరకు నేత్రదానం కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 9640807775, 9948143299 ను సంప్రదించాలని కోరుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆస్పత్రికి చూపు సమస్యతో వచ్చే బాధితులకు హైదరాబాద్ మౌలాలీలోని ఎంఎస్ రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్‌లో ఉచితంగా నేత్ర శస్త్ర చికిత్సలు నిర్వహించి మందులు, కంటి అద్దాలు అందజేస్తున్నారు. భువనగిరి నుంచి ఉచిత రవాణా సదుపాయం కూడా కల్పిస్తున్నారు. ప్రతి సోమవారం 30మందికి శస్త్ర చికిత్సల సేవలు అందిస్తున్నారు.


నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నాము



నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మరణానంతరం నేత్రదానాలకు కుటుంబ సభ్యులు చొరవ చూపాలి. నేత్రదానాన్ని మహాదానంగా పరిగణించాలి. నేత్రదానంతోనే అంధుల సంఖ్య తగ్గుతుంది. ఈ మేరకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తాం.

\- డాక్టర్ మనోహర్, డీఎంహెచ్‌వో యాదాద్రి భువనగిరి.

నేత్రదానం సామాజిక బాధ్యత



నేత్రదానం సామాజిక బాధ్యతగా పరిగణించాలి. ఇందుకోసం నేత్రదాన అంగీకార పత్రాలను స్వచ్ఛందంగా అందజేయాలి. కుటుంబసభ్యులు మరణిస్తే వారి నేత్రాల దానాలకు కుటుంబ సభ్యులు చొరవ చూపాలి. నేత్ర దానాన్ని ఉద్యమంగా చేపట్టి అవగాహన కల్పించాలి.

\- సీహెచ్ పుల్లారావు, నేత్ర వైద్య నిపుణుడు, నల్లగొండ

మా అమ్మ నేత్రాలను దానం చేశాం



మా అమ్మ మంచాల వరమ్మ(90) ఇటీవల భువనగిరిలోని మా ఇంటిలో సహజ మరణం పొందింది. దీంతో కుటుంబ సభ్యుల సమష్టి నిర్ణయంతో ఆమె నేత్రాలను దానం చేశాం. హైదరాబాద్‌కు చెందిన లయన్స్ క్లబ్ ఆసుపత్రి బృందం మా ఇంటికి వచ్చి అమ్మ పార్థీవదేహం నుంచి నేత్రాలను సేకరించారు. నేత్రదానం మా అమ్మ చిరకాల కోరిక.

\- మంచాల రుషికేష్, భువనగిరి.

ఐదుగురు జూదరుల అరెస్ట్

హుజూర్‌నగర్ , సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో పేకాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ చరమందరాజు తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ పక్కన ఓ ఇంట్లో పేకాడుతున్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గురువారం రాత్రి 10 గంటల సమయంలో దాడి చేసినట్లు తెలిపారు. పేకాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.22వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్ చేసినట్లు తెలిపారు.

ఏపీ నుంచి ఇసుక తరలిస్తున్న లారీ సీజ్

హుజూర్‌నగర్ , సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణకు లారీలో ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణకు ఇసుక అక్రమంగా తరలిస్తుండగా హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం సమీపంలో తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేని లారీని సీజ్ చేసినట్లు తెలిపారు. లారీ డ్రైవర్, యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.


ముగ్గురు విటుల అరెస్ట్

హుజూర్‌నగర్ , సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని చైతన్యకాలనీలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తుండగా శుక్రవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో పోలీసులు దాడిచేశారు. ముగ్గురు విటులను పట్టుకున్నట్లు ఎస్‌ఐ బండి మోహన్ తెలిపారు.పట్టుబడిన వారినుంచి రెండు ఆటోలు, మూడు సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. హుజూర్‌నగర్ ప్రాంతంలో కొద్దిరోజులుగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో స్థానికుల సమాచారం మేరకు దాడులు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీజే వాహనం సీజ్

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ ఆదేశాలను ధిక్కరించి శోభాయాత్రలో వినియోగించిన డీజేను సీజ్ చేసినట్లు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి ఎస్‌ఐ దగ్గుల క్రాంతికుమార్ తెలిపారు. ఎల్లారెడ్డిగూడెంలో గణనాథుని విగ్రహం శోభాయాత్ర కోసం సూర్యాపేటకు చెందిన లడ్డూ-99 డీజే వాహనాన్ని వినియోగించారు. దీంతో వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్నేషనల్ ఫార్మాస్యుటికల్ వైస్‌ప్రెసిడెంట్‌గా రమేష్



ఆడెపు రమేష్

సూర్యాపేటరూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డెన్మార్క్‌లో ఈ నెల 3వ తేదీన జరిగిన ఎఫ్ఐపీ సదస్సులో ఇంటర్నేషనల్ ఫార్మాస్యుటికల్ వైస్ ప్రెసిడెంట్‌గా సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన వికాస్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు రమేష్ ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం ఇండియన్ ఫార్మాసిటికల్ చైర్మన్‌గా ఉన్నారు. అదేవిధంగా కళాశాల చైర్మన్ రాందాస్ డెన్మార్క్ దేశంలోని కోపెన్ హెగెన్ నగరంలో ఈ నెల 6వ నిర్వహించే అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటారు. రాందాస్, ఆడెపు రమేష్‌లను కరస్పాండెంట్ సాధినేని శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

నెంబరా.. మజాకా..

» ఆరు సెగ్మెంట్లలో నెంబర్లు

» టైర్-1లో 9999 నంబర్‌కు రూ.1,50,000

» టైర్-2లో 1, 9, 6666 నంబర్లకు రూ.1,00,000



తమ వాహనాలకు ప్రీమియం నెంబర్లు ఉండటం కొంతమంది హోదాగా భావిస్తుంటారు. 1, 0001, 9, 9999 నెంబ ర్లు కావాలని కోరుకుంటారు. ప్రత్యేకతకు చిరునామాగా ఉంటుందని ఇష్టపడతారు. ప్రీమియం నెంబర్ల ద్వారా అధిక ఆదాయం సేకరించాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యం. అందుకు వాహనాలకు ప్రీమియం నెంబర్లకు సంబంధించిన నింబంధనలు మార్చింది.

\- (ఆంధ్రజ్యోతి-కోదాడ)

వాహన రిజిస్ట్రేషన్ నిబంధనలు 1989లోని 81ని సమగ్ర సవరణ చేస్తూ వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లను రిజర్వ్ చేసే ఫీజు విధానం, ప్రక్రియను సవరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఫలితంగా ఫ్యాన్సీ నెంబర్లు ఇష్టపడే వారికి కోసం ప్రభుత్వం ఆరు సెగ్మెంట్లలో ఫీజు నిర్ణయించింది. ప్రీమియం నెంబర్ల కోసం ప్రభుత్వం రూ.1.50 లక్షల వరకు ఫీజు నిర్ణయించింది. ప్రీమియం నెంబర్లు కావాలనుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కావల్సిన నెంబర్‌పై ఎక్కువ దరఖాస్తులు వస్తే వేలం పాట నిర్వహిస్తుంది. వేలం పాటలో అధికంగా పాడిన వారికి రవాణాశాఖ నెంబర్‌ను కేటాయిస్తుంది. అయితే అధిక ఫీజులను చూసి కారు వాహనదారులు నెంబరా.. మజాకా అంటున్నారు.

కొత్త సెగ్మెంట్లలో ఫీజు విధానం

» సవరించిన నింబంధనల ప్రకారం నెంబర్ల పాపులారిటీ, ప్రత్యేకత ఆధారంగా ప్రభుత్వం ఆరు సెగ్మెంట్లుగా ఫీజు నిర్ణయించింది.

» టైర్-1లో ఉండే నెంబర్లు 9999, వీటి ఫీజు రూ.1,50,000

» టైర్-2లో ఉండే నెంబర్లు 1, 9, 6666 ఫీజు రూ.లక్ష

» టైర్-3లోని నెంబర్లు 99, 999, 3333, 4444, 5555, 7777 ఫీజు రూ.50వేలు

» టైర్-4లోని నెంబర్లు 5,6,7, 123, 333, 369,555, 66 6,777, 1111, 1116, 1234, 2222, 2277, 2345, 27 27, 3339, 3366, 3456, 3699, 4455, 4545, 4599, 6669, 6789, 8055, 8888 వీటి ఫీజు రూ.40వేలు

» టైర్-5లోని నెంబర్లు 3, 111, 234, 567, 1188, 1818, 1899, 1999, 2799, 3636, 3999, 5678, 5999, 6999, 7999, 9009 ఫీజు రూ.30వేలు

» టైర్-6లో 2, 4, 8, 11, 18, 27, 36, 39, 45, 55, 77, 143, 222, 405, 444, 456, 459, 786, 789, 909, 1112, 1122, 1212, 1233, 1269, 1314, 1359, 1889, 2223, 2255, 2259, 2349, 2525, 3335, 3344, 3399, 3555, 3789, 3888, 3969, 4446, 4554, 4567, 4777, 4959, 5445, 5559, 5589, 5599, 5666, 5679, 5859, 6336, 6699, 6777, 6786, 6969, 7779, 7799, 7979, 8889, 8899, 8999, 9099ల ఫీజు రూ.20వేలుగా నిర్ణయించారు. ఇతర నెంబర్లకు సాధారణ ఫీజు వసూలు చేస్తారు.

ఆన్‌లైన్ వేలం

అధిక డిమాండ్ ఉండి ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చే నెంబర్ల కోసం ప్రభుత్వం ఆన్‌లైన్‌లో వేలం విధానాన్ని ప్రవేశపెట్టింది. బిడ్డర్లు రెండు గంటలో విండోలో పోటీ పడతారు. అత్యధిక బిడ్డర్ నెంబరును సొంతం చేసుకుంటారు. విఫలమైన బిడ్డర్లు చెల్లించిన ఫీజులో 10శాతం కోల్పోయి, మిగతా డబ్బులు వాపస్ తీసుకుంటారు. కాగా గెలిచిన బిడ్డర్ 15రోజులలో వాహనాన్ని రిజిస్టర్ చేయకపోతే రిజర్వేషన్‌ను రద్దు చేసి, తిరిగి నెంబర్‌ను రవాణా శాఖ వేలం వేస్తుంది.

సిలిండర్ల తూకాల్లో మోసం

కీర్తి పెట్రోల్ కం గ్యాస్ కంపెనీపై కేసు నమోదు

బొమ్మలరామారం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారంలోని కీర్తి పెట్రోల్ కం గ్యాస్ కంపెనీపై కేసు నమోదైంది. తక్కువ తూకంతో సిలిండర్లను విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారంతో జిల్లా తూనికల కొలతల శాఖ అధికారి కందగడ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని రామలింగంపల్లి గ్రామశివారులోని కీర్తి పెట్రోల్ కం గ్యాస్ కంపెనీని గో గ్యాస్ కంపెనీకి లీజుకు తీసుకుంది. అయినప్పటికీ కీర్తి పెట్రోల్ కం గ్యాస్ పేరు మీదటనే సిలిండర్లను సప్లయ్ చేస్తున్నారు. అయితే కమర్షియల్ సిలిండర్లను తక్కువగా నింపుతూ హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తూనికలు కొలతల అధికారులకు పక్కా అందింది. దీంతో శుక్రవారం కంపెనీని అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. 21 కిలోలకు బదులుగా 19 కిలోలు ఉండటంతో 15 కమర్షియల్ సిలిండర్లను సీజ్ చేసి కంపెనీ యజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు జిల్లా తూనికల కొలతల శాఖ అధికారి కందగడ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. కంపెనీ లీజుకు సంబంధించిన సరైన పత్రాలు కూడా లేవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కంపెనీ నిర్వహణ జరుగుతుందన్నారు. ఇదిలా ఉండగా కీర్తి, గోగ్యాస్ కంపెనీలు కలిసే ఈ వ్యవహారం కొనసాగిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. తక్కువ తూకం వేస్తూ వినియోగదారులను దండుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. పూర్తిస్థాయిలో తనిఖీలు చేస్తే అక్రమాలు వెలుగుచూస్తాయని వినియోగదారులు కోరుతున్నారు.

సాగర్ కాల్వలో తండ్రీ కుమారుల గల్లంతు





సాగర్ కాల్వలో గల్లంతైన సాంబయ్య, కుమారుడు శివమణి, ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖరరాజు

వేములపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జన వేడుకల్లో విషాదం నెలకొంది. అప్పటిదాకా ఆనందంగా గడిపిన తండ్రీకుమారులు సాగర్ ఎడమ కాల్వలో గల్లంతయ్యారు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. వేములపల్లి ఎస్‌ఐ డి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన తండ్రీకుమారులు పున్నా సాంబయ్య(50), శివమణి(20) తమ వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు వేములపల్లి మండల కేంద్రంలోని సాగర్ ఎడమకాల్వ వద్దకు చేరుకున్నారు. కాల్వలో నిమజ్జనం చేసి తిరిగి ట్రాక్టర్‌లో ఇంటికి వెళ్లే క్రమంలో కాల్వకు మరోవైపున ట్రాక్టర్‌ను ఆపిన సాంబయ్య కాల్వలోకి మెట్ల ద్వారా దిగి కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుంటున్నాడు. ప్రమాదవశాత్తు కాల్వలో పడి కొట్టుకుపోతుండగా గమనించిన కుమారుడు అందుబాటులో ఉన్న వస్త్రం విసిరాడు. ఆ వస్త్రాన్ని సాంబయ్య ఒక్కసారిగా లాగడంతో కుమారుడు సైతం అందులో పడిపోయాడు. పక్కనే ఉన్న అదే గ్రామానికి చెందిన మిర్యాల నవీన్ వారిని కాపాడేందుకు కాల్వలోకి దూకగా అప్పటికే తండ్రీకుమారులు నీటిలో గల్లంతయ్యారు. నవీన్ పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు సిబ్బంది లైఫ్ జాకెట్లు కాల్వలోకి దిగి చూడగా, అప్పటికే వారి ఆచూకీ లభ్యం కాలేదన్నారు. సాంబయ్య సోదరుడు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి కాల్వ కట్ట వెంట గాలింపు చర్యలు చేపట్టారు. సాంబయ్య వంట మనిషిగా పనిచేస్తుండగా, శివమణి ఐటీఐ పూర్తి చేసుకొని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు.

సంఘటనా స్థలం పరిశీలన..

గణేష్ నిమజ్జనానికి వచ్చి సాగర్ ఎడమకాల్వలో తండ్రీకుమారులు గల్లంతైన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజులు హుటాహుటిన వేములపల్లి మండల కేంద్రంలోని సాగర్ ఎడమ కాల్వ కట్ట వద్దకు చేరుకున్నారు. సీఐ పీఎన్‌డీ.ప్రసాద్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లును సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకుని కాల్వ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగర్ ఎడమకాల్వపై పూర్తిస్థాయి బందోబస్తును నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను సూచించారు. కాల్వ వెంట రెండు బృందాలను ఏర్పాటుచేసి గాలింపు చర్యలు చేపడుతున్నామని, బాధిత కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు హేమలత, సురేష్, ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, కృష్ణయ్య ఉన్నారు.

ఒంటరైన కుమార్తె నందిని

సాంబయ్యకు కుమారుడు శివమణితో పాటు కుమార్తె నందిని ఉంది. నందిని గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతుండగా, నందిని ఏడాది వయస్సు ఉన్నప్పుడే తల్లి మృతి చెందింది. తండ్రి సాంబయ్యే అన్నీ తానై అల్లారుముద్దుగా పెంచుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కాగా తనకు అండగా ఉన్న తండ్రి సాంబయ్య, అన్న శివమణి నిమజ్జన వేడుకలకు వెళ్లి సాగర్ ఎడమకాల్వలో గల్లంతు కావడంతో ఒంటరిగా మిగిలిపోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రి, సోదరుడు కాల్వలో గల్లంతైన విషయం తెలిసి నందిని బోరున విలపించింది.

ట్రాక్టర్ కిందట పడి...



యాదయ్య(ఫైల్)

తిప్పర్తి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వినాయక నిమజ్జనానికి వెళ్లి వస్తుండగా ఓ వ్యక్తి ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం మర్రిగూడెం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మర్రిగూడెం గ్రామానికి చెందిన ఏశబోయిన యాదయ్య(45) గ్రామస్థులతో కలిసి వినాయకుడి నిమజ్జనంలో పాల్గొన్నారు. గ్రామశివారులోని సర్వప్పబావి వద్ద ఉన్న చెరువుకుంటలో వినాయకుని నిమజ్జనం చేసుకొని తిరిగి వస్తున్నారు. ట్రాక్టర్‌డ్రైవర్ పక్కన కూర్చున్న యాదయ్య ప్రమాదవశాత్తు జారి ట్రాక్టర్ మధ్య టైర్ల ముందు పడిపోయాడు. ఈ క్రమంలో యాదయ్యపై నుంచి ట్రాక్టర్ పెద్ద టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. యాదయ్యకు భార్య మల్లమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇరువురు మృతి

దేవరకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండబీమనపల్లి దేవరాజ్‌తండాలో వాహనం బోల్తాపడిన సంఘటనలో యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దేవరాజ్‌తండాకు చెందిన ప్రభు కుమారుడైన నేనావత్ శ్రీనాథ్(17) ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పనినిమిత్తం దేవరకొండకు వచ్చారు. పని పూర్తిచేసుకొని సాయింత్రం తండాకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తండా సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి బోల్తా పడ్డాడు. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో దేవకొండ ప్రభుత్వఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఫొటోగ్రాఫర్ ...



మహేశ్వర్(ఫైల్)

రామన్నపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఫొటోగ్రాఫర్ మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో జరిగింది. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన నకిరేకంటి మహేశ్వర్ (45) గ్రామంలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై రామన్నపేటకు వస్తుండగా రామన్నపేట-సిరిపురం మధ్యలోని ఆయిల్‌పామ్ తోట సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో మహేష్ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రామన్నపేట ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. భార్య అవంతి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. మహేశ్వర్‌కు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నల్లగొండ గణేష్ నిమజ్జన శోభాయాత్రలో ఉద్రిక్తత



వర్షిత్‌రెడ్డిని పోలీస్ వాహనంలోకి తీసుకెళ్తున్న పోలీసులు

నల్లగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): గణేష్ శోభాయాత్ర ప్రారంభం సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఉద్రిక్తత కొనసాగింది. నగర గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని పాతబస్తీలోని ఒకటోనెంబర్ గణేష్ విగ్రహం వద్ద ఉదయం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గణేష్ పూజలు నిర్వహించి సభావేదిక పైనుంచి మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో గంగ, యమున తెహజీబ్ సంస్కృతి కొనసాగుతోందని, కులమతాలకతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొంటూ పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్నారు. ఆ క్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి సభావేదిక ముందు నిరసన వ్యక్తం చేస్తూ గణేష్ శోభాయాత్రలో రాజకీయాలు, ఇతర మతాల గురించి మాట్లాడవద్దంటూ ఆందోళనకు దిగడంతో అదే సమయంలో బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. గతేడాది వరకు శోభాయాత్ర సందర్భంగా ఒకటోనెంబర్ విగ్రహం వద్ద అధికార పార్టీ నేతలే కాకుండా అన్ని పార్టీల నాయకులు, అన్ని మతాల పెద్దలను వేదిక మీదకు ఆహ్వానించి సందేశాలిప్పించిన తర్వాత శోభాయాత్ర మొదలయ్యేదన్నారు. ఈసారి ఆ సంప్రదాయాన్ని పక్కనబెట్టారని బీజేపీ నాయకులు ఆరోపించడంతో ఉద్రిక్తత మొదలైంది. ఇదే సమయంలో కాంగ్రెస్ నాయకులు మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు సైతం బీజేపీ నాయకులతో ఘర్షణకు దిగారు. పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుండడంతో రంగంలోకి దిగిన పోలీసులు బీజేపీ జిల్లా అధ్యక్షుడిని బలవంతంగా అక్కడి నుంచి పోలీస్ వాహనంలో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బీజేపీ అధ్యక్షుడిని అక్రమంగా అరెస్ట్ చేశారంటూ బీజేపీ నాయకులు పోలీసులను నిలువరించే ప్రయత్నం చేశారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని సైతం పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆయన నల్లగొండలో గతానికి భిన్నంగా విషసంస్కృతిని నెలకొల్పుతున్నారని, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డిని విడుదల చేసేంతవరకు శోభాయాత్ర మొదలు పెట్టవద్దంటూ అక్కడే బైఠాయించారు. ప్రసంగం అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అక్కడినుంచి వేరే కార్యక్రమాలకు వెళ్లిపోగా, అరగంట తర్వాత బీజేపీ జిల్లా అధ్యక్షుడిని పోలీసులు వదిలిపెట్టారు. అనంతరం తిరిగి బీజేపీ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు గణేష్ మండపం వద్ద పూజలు జరిపి శోభాయాత్రను కొనసాగించారు.



మండపం వద్ద నిర్వాహకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పంట కోసం.. రైతు తంటా

రైతులకు యూరియా కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. సకాలంలో పంటకు వేసుకొని, కాపాడుకుందామంటే యూరియా అందక అన్నదాత అష్టకష్టాలు పడుతున్నాడు. ఉదయం వచ్చి సాయంత్రం వరకూ క్యూలైన్లలో వేచి చూస్తున్నారు. ఆ లైన్లలో నిలబడే సత్తువ లేక చెప్పులు, పాస్ పుస్తకాలు పెట్టి, ఇతర పనులు చూసుకుంటున్నారు. రైతులకు సరిపడా యూరియా రాకపోవడంతో ఒక్కసారిగా లారీల వద్ద ఎగబడుతుండడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో పోలీస్ పహారా నడుమ యూరియా పంపిణీ చేస్తున్నారు.

● కొనసాగుతున్న యూరియా ఆందోళనలు ● ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతుల నిరీక్షణ ● క్యూలైన్లలో చెప్పులు, పాస్ పుస్తకాలతో ఎదురుచూపు ● పలుచోట్ల పోలీస్ పహారా నడుమ యూరియా పంపిణీ


మోతె మండలం సిరికొండ సహకార సొసైటీ వద్ద యూరియా బస్తాలకోసం బారులు తీరిన రైతులు


అడవిదేవులపల్లిలో..


మునగాలలో..

మునగాల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా యూరియా కొరత ఏర్పడటంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మునగాల, తాడ్వాయి, ఆకుపాముల, కొక్కిరేణి, నడిగూడెం మండల కేంద్రంలో ఉన్న సహకార సంఘాల వద్ద అర్థరాత్రి నుంచే రైతులు క్యూ కడుతున్నారు. అంతే కాదు ఉదయం ఏడు గంటలు కానిది అధికారులు వచ్చి యూరియా ఇవ్వరూ. అంతసేపు క్యూలో నిలబడలేక రైతులు తమ కాళ్ల చెప్పులను క్యూలో ఉంచుతున్నారు. మునగాలలో 260 యూరియా బస్తాలు వస్తే 130 మంది రైతులే తీసుకున్నారు. మరో 100 మంది రైతులకు యూరియా దొరకక పోవటంతో వెనుదిరిగి వెళ్లారు. కాగా చిన్న, సన్నకారు రైతులు మాత్రమే అర్థరాత్రి నుంచి క్యూలో ఉంటుతున్నారు. నాయకులు క్యూలో నిలబడినట్లు కనిపించకపోవటంతో రైతుల్లో అనుమానం వ్యక్తమవుతోంది. నాయకులకు వ్యవసాయం ఎక్కువగా ఉంటుంది కదా.., వారికి యూరియా ఎలా అందుతుందని చర్చించుకుంటున్నారు. అసలైన రైతులకు భూమి పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లను చూసి యూరియా ఇవ్వాలని రైతులు బి.సైదులు, ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.రాంబాబు, వెంకట్‌రెడ్డి, అంజయ్య, రామిరెడ్డి డిమాండ్ చేశారు.

యూరియా కోసం రైతన్నల ఆందోళన

అడవిదేవులపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతన్నల ఆందోళన తగ్గడం లేదు. తాము వరినాట్లు వేసుకొని సుమారు నెల రోజులైనా ఇప్పటివరకు ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా అందించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. యూరియా కోసం మండల రైతులు రాత్రింబవళ్లు వ్యవసాయాధికారి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా యూరియా అందడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వరినాట్లు వేసిన 15 రోజులకే మొదటిసారి యూరియా చల్లాల్సి ఉందని, కానీ నెల రోజులైనా చల్లకపోవడంతో పిలకలు రావడం లేదని, దీంతో దిగుబడిపై ప్రభావం పడి తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి రైతులకు సకాలంలో సరిపడా యూరియా అందించి ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.


మద్దిరాలలో..

గుండాల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం యూరియా కోసం బారులు తీరారు. యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు వివిధ గ్రామాల నుంచి ఉదయం నుంచే తరలి వచ్చారు. 444 బస్తాలు యూరియా రైతులకు పంపిణీ చేశారు. యూరియా దొరకక మిగిలిన రైతులు వెనుదిరిగి వెళ్లారు. మరో రెండు రోజుల్లో యూరియా వస్తుందని అధికారులు తెలిపారు.

మద్దిరాల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు నానా పాట్లు పడుతున్నారు. శుక్రవారం ఉదయమే సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలకేంద్రంలోని రైతు ఆగ్రోస్ సేవ కేంద్రం, ఎన్‌డీసీ కేంద్రాల వద్ద రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. యూరియా వచ్చిందనే సమాచారం తెలుసుకున్న రైతులు వేకువజామునే మండల కేంద్రానికి చేరుకొని క్యూలైన్‌లో నిలబడ్డారు. మండలంలో 888 బస్తాల యూరియా రాగా, వివిధ గ్రామాల రైతులకు ఆధార్‌కార్డుకు ఒకటి, రెండు చొప్పున అందజేశారు. రైతులు ఎక్కువ సంఖ్యలో రావడంతో పోలీసులు ఒక్కొక్క రైతును క్యూలైన్‌లో నిలబెట్టి యూరియా బస్తాలు అందజేశారు.

యూరియా కోసం నిరీక్షణ

మోతె, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని సిరికొండ సహకార సొసైటీ ద్వారా కేంద్రానికి యూరియా వస్తుందనే సమాచారంతో శుక్రవారం ఉదయమే మహిళలు, చిన్నారులు, రైతులు తమ ఆధార్‌కార్డులతో లైన్‌లో నిలబడ్డారు. యూరియా లారీ ఉదయం 10 గంటలకు రాగానే రైతులు ఒకేసారి ఎగబడ్డారు. లారీలో ఉన్న బస్తాలను దిగుమతి చేయకుండానే మోతె ఎస్ఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్రంలో రెండు వరుసల క్యూలైన్ ఏర్పాటుచేసి ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున అందజేశారు.

సిబ్బందితో రైతుల వాగ్వాదం

క్యూలైన్‌లో 550 మంది రైతులు వేచి ఉండగా, కేవలం 250 బస్తాలు మాత్రమే యూరియా వచ్చింది. దీంతో రైతులు సహకార సొసైటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. సహకార సొసైటీ పాలకవర్గం మరికొందరు కలిసి యూరియా బస్తాలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. మామిళ్లగూడెంలో 200 బస్తాల లారీ లోడ్ రాగా, 400 మంది రైతులు క్యూలైన్‌లో నిలబడ్డారు. పోలీసుల సహకారంతో పంపిణీ చేశారు. మండలంలో జోరుగా అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

పోలీసుల పహారా నడుమ పంపిణీ

మర్రిగూడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని శివన్నగూడ గ్రామంలో వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం యూరియా సరఫరా చేస్తుండగా రైతులు ఎగబడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు యూరియా పంపిణీ చేస్తున్న గోదాం దగ్గరికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ఇబ్బందులు తలెత్తకుండా వరుస క్రమం ఏర్పాటు చేసి, సజావుగా పంపిణీ చేశారు. ఈ సొసైటీ పరిధి కింద 28,000 ఎకరాల వరకు రైతులు వరి పత్తిసాగు చేసుకున్నారు. రైతులను దృష్టిలో పెట్టుకొని యూరియా కొరత రాకుండా సకాలంలో రైతులకు చేయాలానే ఉద్దేశంతో రైతులకు సరఫరా చేసి పంపిణీచేశారు. శుక్రవారం ఈ సొసైటీకి 22టన్నుల 440 యూరియా బస్తాలను సరఫరాచేశారు. యూరియా పంపిణీ చేస్తున్నారని గోదాం వద్దకు అధిక సంఖ్యలో 600మంది రైతులు చేరుకున్నారు. ఒక రైతుకు ఎకరానికి రెండు బస్తాలు చొప్పున పంపిణీ చేయడంతో మిగిలిన రైతులకు యూరియా దొరక్క నిరాశ చెంది వెనుదిరిగి వెళ్లారు.

మోత్కూరులో రైతుకు రెండు బస్తాలు

మోత్కూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు సింగిల్ విండో వద్ద శుక్రవారం యూరియా పంపిణీ ప్రశాంతంగా జరిగింది. సంఘానికి గురువారం సాయంత్రం 444 యూరియా బస్తాలు వచ్చాయి. ఈ నెల 1వ తేదీన యూరియా బస్తాలు వచ్చిన సందర్భంగా రైతులు ఎక్కువగా రావడంతో ఆ రోజు బస్తాలు ఉన్న మేరకు పంపిణీ చేసి, మిగిలిన వారికి టోకెన్లు ఇచ్చారు. శుక్రవారం ఇప్పటికే టోకెన్లు తీసుకున్న వారికే ప్రాధాన్యమిస్తామని చెప్పడంతో రైతులు ఎక్కువగా రాలేదు. సింగిల్ విండో కార్యాలయం ఎదుట టెంటు వేసి కుర్చీలు వేయడంతో గతంలో టోకెన్లు తీసుకున్న రైతులు వచ్చి ప్రశాంతంగా కూర్చుని తీసుకెళ్లారు. గతంలో టోకెన్లు తీసుకున్న రైతులకు ఇచ్చిన తర్వాత మిగిలిన బస్తాలు శుక్రవారం వచ్చిన రైతులకు ఇచ్చారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున సుమారు 200 మంది రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఎలాంటి గొడవలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సింగిల్ విండో చైర్మన్ యూరియా పంపిణీని పర్యవేక్షించారు.

వైభవంగా నృసింహుడి నిత్యకల్యాణం


తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామి వారికి సువర్ణ పుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా సాగాయి. ఆగమ శాస్త్రరీతిలో వేడుకలు నిర్వహించిన అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేద మంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులతో మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగవ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.21,96,005 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. కాగా, హైకోర్టు న్యాయమూర్తి సుద్దాల చలపతి కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకొని గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలుచేశారు. వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేయగా అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి లడ్డూ ప్రసాదం, ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

టీటీడీ తరహాలో వైటీడీని అభివృద్ధి చేయాలి

● సీఎం రేవంత్‌రెడ్డి సూచన


సీఎంకు పూలమొక్క ఇస్తున్న ఈవో

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట (వైటీడీ) దేవస్థానాన్ని టీటీడీ తరహాలో అభివృద్ధి పర్చాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు సీఎంను కలిశారు. యాదగిరిగుట్ట దేవస్థానం ఈవోగా తనకు అవకాశం కల్పించినందుకు సీఎంకు స్వామివారి శేష వస్త్రం, లడ్డూ ప్రసాదం, మొక్కను అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పర్చేందుకు అవసరమైన అనుమతులు, ఉత్తర్వులు సీఎం పొందాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలను తప్పకుండా అమలు చేస్తామని ఈవో తెలిపారు.

ఎల్లమ్మ ఆలయం మూసివేత రేపు


దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయం

కనగల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని ఈ నెల 7న ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో మూసివేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆలయాన్ని సోమవారం తెరుస్తామన్నారు. భక్తులు గమనించి ఆలయ సిబ్బందికి సహకరించాలని సూచించారు.

బాల్‌బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు రేపు

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 7వ తేదీన జిల్లాకేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు విద్యుత్ పోల్ సెంటర్ క్రీడామైదానంలో నిర్వహించనున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిశెట్టి బయ్యన్న ఒక ప్రకటనలో తెలిపారు. జనగాం జిల్లా జాఫర్‌గఢ్ మండలం కునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించే అంతర్ జిల్లాల 44వ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన క్రీడాజట్లు పాల్గొంటాయని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు బోనాఫైడ్, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని, ఇతర వివరాలకు సెల్:9398081178ను సంప్రదించాలన్నారు.

అభివృద్ధే ధ్యేయం.. పురోగతే లక్ష్యం

● పాఠశాలల్లో నూతన ఒరవడి ● విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు


విభిన్న బోధనోపకరణలతో హెచ్‌ఎం శ్రవణ్‌కుమార్

వారికి బడి అంటే ఇష్టం. ఆ వాంఛతో పాఠశాల రూపు రేఖలు ఎలా మార్చాలి. విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు ఎలా వేయాలి.. అనే ఆలోచనతో వినూత్నంగా పాఠాలు బోధిస్తున్నారు. దాతల సహకారాన్ని తీసుకొని విద్యార్థులకు డిజిటల్ రూపంలోనూ పాఠాలు బోధిస్తున్నారు. వారి సేవలకు గుర్తింపుగా ప్రభుత్వాలు అవార్డులను సైతం ప్రకటిస్తున్నాయి.

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధే ధ్యేయంగా, విద్యార్థుల పురోగతే లక్ష్యంగా విద్యాబోధనలో నూతన ఒరవడి సృష్టిస్తూ ప్రైవేట్ పాఠశాలను స్ఫూర్తించే విధంగా ఆత్మకూర్(ఎస్)జడ్పీ ఉన్నత పాఠశాల రూపురేఖలను మార్చేశాడు ప్రధానోపాధ్యాయుడు శ్రవణ్ కుమార్. పాఠశాల అభివృద్ధికి గోడలపై సైన్స్, గణితం, స్పోర్ట్స్ రంగులతో బొమ్మలను దాతల సహకారంతో వేసి పలువురిని ఆకర్షించేలా చేశారు. తాగునీటి సదుపాయం, పాఠశాల గోడలకు రంగులు వేయించారు. 2002-03 పదోవ తరగతి పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.50 వేలు విరాళాలు సేకరించి పాఠశాలకు 6 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పాఠశాలలో చదివే విద్యార్థుల పుట్టిన రోజు వేడుకలు పాఠశాలలో ప్రార్థనలు నిర్వహించి పాఠశాల తరుపున రూ. 100 గిఫ్ట్, చాక్లెట్‌లు అందజేయడం వల్ల ప్రతి విద్యార్థి ఆత్మస్థైర్యంగా నిలిచారు. వెనుకబడిన విద్యార్థుల కోసం మధ్యాహ్నం చివరి పిరియడ్‌లో మూడు గ్రూపులుగా చేసి ప్రత్యేక బోధన సాగిస్తున్నారు. పాఠశాలకు విద్యార్థులను ఆకర్షించి ప్రైవేటు పాఠశాల విద్యార్థులు చేరే విధంగా వీడియో, ఆడియోలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వాట్సాప్ గ్రూప్‌ల్లో పంపి గ్రామంలో తల్లిదండ్రులను ఆకట్టుకుంటారు. పాఠశాలకు గ్రామస్తుల నుంచి అనుబంధం బాధ్యతలను ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో పదో తరగతి టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు, బహుమతులు అందజేస్తారు. పలు పోటీ పరీక్షలు, క్రీడల్లో నైపుణ్యం ఉన్న విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు. పాఠశాల అభివృద్ధి కోసం గ్రామస్తులను భాగస్వాములుగా చేసి సమస్యలు పరిష్కారం చేస్తుంటారు. పాఠశాలను అన్ని హంగులతో అభివృద్ధి పరిచే శ్రవణ్ కుమార్‌కు గ్రామస్తులు అండగా నిలుస్తున్నారు.

విద్యార్థులకు జీవన పాఠాలు




డిజిటల్ పాఠాలు బోధిస్తున్న ప్రవీణ్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని గాంధీపార్కు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ పెద్దపంగ ప్రవీణ్ విద్యార్థులకు ఆధునిక బోధన అందిస్తున్నారు. తాను చదివిన పాఠశాలకే గురువుగా వచ్చిన ప్రవీణ్.. తన శిష్యులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాడు. జీవ శాస్త్ర ఉపాధ్యాయుడైన ప్రవీణ్ సొంత ఖర్చులతో విద్యార్థులకు జీవన పాఠాలు బోధిస్తున్నాడు. లైఫ్ సైన్సెస్‌పై అమితాసక్తి కలిగిన ఈ గురువు విద్యార్థులకు బట్టీ విధానం కాకుండా ప్రయోగాత్మక బోధనాన్ని' అందిస్తున్నాడు. సొంత ఖర్చులతో ల్యాప్‌టాప్, సాఫ్ట్‌వేర్, పెన్ డ్రైవ్స్ కొనుగోలు చేసి డిజిటల్ పాఠాలు బోధిస్తున్నాడు. మానవ మనుగడ - జీవ వైవిధ్యంపై శిక్షణ ఇచ్చేందుకు రోజూ రెండుగంటలు ఇంట్లో సాధన చేస్తున్నాడీ ఉపాధ్యాయుడు.

తల్లీ కుమారులు ఒకే పాఠశాలలో ఉపాధ్యాయులుగా..

పట్టణంలోని గాంధీపార్కు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రైమరీ విద్యనభ్యసించిన పెద్దపంగ ప్రవీణ్ అదే పాఠశాలలో సైన్స్ టీచర్‌గా విద్యాసేవలందిస్తున్నాడు. అక్షరాభ్యాసం చేసిన విద్యాలయానికే ఉపాధ్యాయుడిగా రావడం, నాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ పాఠ్యాంశాలు బోధించడం గొప్ప విషయమైతే.. అదే పాఠశాలలో అతని మాతృమూర్తి ఉపాధ్యాయురాలిగా సేవలందించడం విశేషం. నాలుగు దశాబ్దాల క్రితం గాంధీపార్కు ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన పెద్దపంగ ప్రవీణ్ అదే పాఠశాలకు జీవ శాస్త్ర (బయోసైన్స్) ఉపాధ్యాయుని(స్కూల్ అసిస్టెంట్)గా వచ్చారు. 2024లో జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా కౌన్సిలింగ్ ద్వారా గాంధీపార్కు పాఠశాలకు వచ్చారు. గాంధీ పార్కు పాఠశాలలోనే 1980లో సోషల్ టీచర్‌గా సేవలందించిన సువార్త టీచర్ కుమారుడే ప్రవీణ్. సువార్త టీచర్ తన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చదివించింది. ప్రభుత్వ బడుల్లో చదివిన సువార్త టీచర్ నలుగురు పిల్లలూ సర్కారు కొలువులు సాధించడం విశేషం.

ఆరోగ్యం సహకరించకున్నా..

కుటుంబ పరిస్థితుల కారణంగా డిప్రెషన్‌కు గురైన ప్రవీణ్‌కు మధుమేహం దగ్గరైంది. విపరీతంగా షుగర్ పెరగడంతో కంటి చూపు మందగించింది. ఒక కన్ను పూర్తిగా కనిపించకపోగా, మరో కన్ను అర్థభాగం దెబ్బతిన్నది. కొంతకాలం చికిత్స తీసుకున్న ప్రవీణ్ పూర్తిగా కోలుకోకపోయినప్పటికీ విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించేందుకు అధిక సమయం కేటాయిస్తున్నారు.

తనకు తానే హోంవర్క్ ఇచ్చుకుంటున్న ప్రవీణ్

విద్యార్థులకు హోంవర్క్ ఇవ్వాలంటే ముందుగా మనం ప్రిపేర్ కావాల్సిన అవసరముందంటున్నాడు ప్రవీణ్. అందుకే తనకు తాను రోజుకు రెండు మూడు గంటల హోంవర్క్ ఇచ్చుకుంటున్నానని, ఏ రోజు పని ఆ రోజే పూర్తి చేసుకుని విద్యార్థుల ముందుకు వస్తున్నట్లు తెలిపాడు. విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక విద్యనందించేందుకు సుమారు రూ.80వేలు ఖర్చు చేసిన ప్రవీణ్ సొంతంగా ఇంటర్నెట్ బిల్లు చెల్లించుకుంటూ విద్యార్థులకు డిజిటల్ పాఠాలు నేర్పడం ఆదర్శనీయం.

ఆసక్తి ఉంటే.. ప్రతీదీ నేర్చుకోవచ్చు



విస్తరిస్తున్న ఇంటర్నెట్ సేవలతో విద్యార్థులు ప్రతీది నేర్చుకోవచ్చు. భవిష్యత్ అంతా ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ మయమవుతుంది. అందుకనుగుణంగా విద్యార్థులు సంసిద్ధులవ్వాల్సిన అవసరం ఉంది. పెన్ను, పేపర్‌తో కాకుండా.. సబ్జెక్టును బట్టి బోధన పద్ధతులు మార్చాల్సిన అవసరం ఉంది. మారుతున్న విద్యావిధానాలు, విద్యార్థులకు అవసరమైన వీడియోలు, ప్రాజెక్టులను సమకూర్చి వారికి అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నాం.

ప్రవీణ్, స్కూల్ అసిస్టెంట్ (బయోసైన్స్), మిర్యాలగూడ

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా కవిత


ఉత్తమ అవార్డు అందుకుంటున్న కవిత

సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గురుకుల జూనియర్ కళాశాలలో అర్థిక శాస్త్రం లెక్చరర్‌గా పనిచేస్తున్న కొండ కవిత రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. శుక్రవారం హైదారాబాద్‌లోని గచ్చిబౌలి శిల్పకళా వేదికలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేశారు. ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కార గ్రహీత కవితకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా, నవీన్ నికోలస్‌లు పురస్కారాన్ని అందజేసి, అభినందించారు. కవిత 29 ఏళ్లుగా అర్థిక శాస్త్రంలో వినూత్నరీతిలో విద్యాబోధన చేస్తూ, తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారాన్ని అందుకున్న కవితను పలువురు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందిచారు.

గరిడేపల్లి: గరిడేపల్లి మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టి గరిడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న పానుగోతు చత్రునాయక్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా చత్రునాయక్ మాట్లాడుతూ గతంలో ఎన్నో అవార్డులు వచ్చాయని, ఈ రాష్ట్రస్థాయి అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు.

యూరియా సమస్యను పరిష్కరించాలి

శాలిగౌరారం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యూరియా సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య కోరారు.మండలకేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లా డారు. సాగు విస్తీర్ణం పెరగడంతో ప్రభుత్వం పంపించే యూరియా సరిపోవడం లేదన్నారు. సరిపడ యూరియా సరఫరాచేయడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. వెంటనే యూరియా సరఫరా చేసి రైతులను ఆదుకోవాలన్నారు.



సెల్ఫీ

కన్నులపండువగా శోభాయాత్ర

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గణేష్ నవరాత్రో త్సవాల సందర్భంగా చివరి రోజైన శుక్రవారం శోభాయాత్ర నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామాలతో పాటు జిల్లా కేంద్రమైన నల్లగొండలో సందడి కనిపించింది. వినాయక పండపాల నుంచి అందంగా అలంకరించిన వాహనాల్లో వినాయక ప్రతిమలను ఊరేగింపుగా తరలించారు. జిల్లా కేంద్రమైన నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో రాత్రి 10 గంటల వరకు వినాయకుల శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. అనంతరం వల్లభరావు చెరువులో నిమజ్జనం చేశారు.



నల్లగొండలోని 19వ వార్డులో...



వల్లభరావు చెరువు వద్దకు వినాయకుడితో..



శాలిగౌరారం మండల కేంద్రంలో...



వినూత్న వాహనంతో గణేషుడు



కనగల్‌లో గణేషుడి శోభాయాత్ర



క్లాక్‌టవర్ సెంటర్‌లో



నార్కట్‌పల్లిలో



వల్లభరావు చెరువు వద్ద



నల్లగొండలో బైక్‌పై వినాయకుడిని తీసుకెళ్తున్న భక్తులు



నల్లగొండలో వివిధ రూపాల్లో కళాకారుల ప్రదర్శన

అడుగడుగునా భక్తుల నీరాజనాలు

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కోలాహలం మధ్య శుక్రవారం గణేష్ నిమజ్జన శోభాయాత్ర శోభాయమానంగా, ప్రశాంతంగా సాగింది. స్వామికి భక్తులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. నల్లగొండలోని అపార్ట్‌మెంట్లు, కాలనీలో వినాయక విగ్రహాలకు చివరిసారిగా పూజలు నిర్వహించి. లడ్డూ, వస్త్రాలను వేలం వేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో లంబోధరుడుని ఆశీనులను చేసి భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. విగ్రహం ముందు నృత్యాలు, మహిళలు కోలాటాలు, వివిధ వేషాధారణ చేసిన కళాకారుల ఆటపాలు సాగాయి. అన్నివిగ్రహాలు క్లాక్ టవర్ మీదుగా వెళ్లేలా రూట్ మ్యాప్ తయారు చేయడంతో సాయంత్రం క్లాక్‌టవర్ సెంటర్ భక్తులతో సందడిగా మారింది. వినాయకులను తిలకించి పరవశించారు. హనుమాన్‌నగర్‌లోని మొదటి వినాయకుడి మండపం వద్ద శోభాయాత్ర కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్‌లు పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం లాంఛనంగా ఊరేగింపును ప్రారంభించారు. మొదటి విగ్రహం ముందు శాంతి సంఘం, గణేష్ ఉత్సవ సమితి, పోలీసు, రెవెన్యూ, వివిధ పార్టీల నాయకులు ముందుండి శోభాయాత్రను నడిపించారు. చిన్నవిగ్రహాలు వల్లభరావు చెరువులో, పెద్ద విగ్రహాలను 14వ మైలు రాయి వద్ద గల కాలువలో నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో శాంతి సంఘం, ఉత్సవ సమితి, వివిధ పార్టీల నాయకులు మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఏ హఫీజ్‌ఖాన్, కలీం, ఆర్డీవో అశోక్‌రెడ్డి, ఇటికాల కృష్ణయ్య, గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు యాదగిరి, చింతసాంబ మూర్తి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, వెంకట్‌నివాస్, బండారు ప్రసాద్, గోలి మధుసూదన్‌రెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, వీరెల్లి చంద్రశేఖర్, కట్ట సంపత్, ఏఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాంరెడ్డి, అల్లి సుభాష్ యాదవ్, మాజీ ఎండ్ల శ్రీనివాస్, గోగుల శ్రీనివాస్, గుండెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు.

● వీటీ కాలనీలోని హనుమాన్ దేవాలయంలో మట్టి వినాయకుడికి పూజలు నిర్వహించి నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో నూకల జైపాల్‌రెడ్డి, నాగులపల్లి శ్యాంసుందర్,అంజిరెడ్డి పాల్గొన్నారు.

● కట్టంగూరు మండలంలో శుక్రవారం గణనాథుల శోభాయాత్ర వైభవంగా సాగింది. అనంతరం ఆయా గ్రామాల్లోని చెరువుల వద్ద నిమజ్జనం చేశారు. కొన్ని గణనాథులను నిమజ్జనం కోసం హాలియా, నాగార్జున సాగర్, విజయవాడ సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లారు.

● శాలిగౌరారం మండలంలో భక్తిశ్రద్ధలతో గణేష్ విగ్రహాలకు నిమజ్జనం చేశారు. అనంతరం శాలిగౌరారం ప్రాజెక్టులో ఘనంగా నిమజ్జనం చేశారు.

● నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని పార్వతీ అమ్మవారి గుడి ప్రాంగణంలోని వినాయక విగ్రహానికి శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్గ బాలకృష్ణ, నాయకులు రేగట్టె నర్సింహారెడ్డి, వారాల రమేశ్, రేగట్టె నవీన్‌రెడ్డి, గడుసు శశిధర్‌రెడ్డి, ఉద్యోగులు తిరుపతిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, లింగయ్య, వెంకటయ్య, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

లడ్డూల కోసం పోటాపోటీ

మర్రిగూడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండల కేంద్రంలో మతాలకతీతంగా వినాయక లడ్డూను వేలంలో ఓ ముస్లిం దక్కించుకున్నారు. స్థానిక శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో మర్రిగూడ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నిర్వాహకులు శుక్రవారం స్వామి వారి లడ్డూకు వేలం నిర్వహించారు. మండలకేంద్రానికి చెందిన ముస్లిం మహమ్మద్ యాసిన్‌అలీ రూ.20 వేలకు పాడి దక్కించుకున్నారు. అనంతరం మేళాతాళాలతో ఊరేగింపుగా ఆయన ఇంట్లో అందజేశారు.

పెద్దబావిగూడెంలో రూ.1.80 లక్షలకు

● : చిట్యాలలో పెద్దబావిగూడెం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విఘ్నేశ్వరుడి వద్ద లడ్డూను రూ.1.80 లక్షలకు రెడ్డిపల్లి చంద్రయ్య దక్కించుకున్నారు. అలాగే నేతాజీ యువజన సంఘం వద్ద బండారు శివ రూ.1.12 లక్షలకు దక్కించుకున్నారు.

● కనగల్ మండలంలోని కురంపల్లి గ్రామపంచాయతీ రాగిబావిగూడెంలో నంద్యాల పెదవెంకట్‌రెడ్డి రూ.1,01,116కు లడ్డూను దక్కించుకున్నారు.

● కట్టంగూరు మండలకేంద్రంలోని రాంనగర్‌లో వినాయక లడ్డూను కాలనీకి చెందిన అబ్బగోని సైదులు, కళమ్మ దంపతులు రూ.1,45,116లకు దక్కించుకున్నారు.



మర్రిగూడలో లడ్డూను దక్కించుకున్న ముస్లిం యాసిన్‌అలీ



చిట్యాలలో రూ.1.80 లక్షలకు దక్కించుకున్న చంద్రయ్య



కనగల్ మండలంలో లడ్డూతో పెద్దవెంకట్‌రెడ్డి



కట్టంగూరులో లడ్డూతో సైదులు, కళమ్మ దంపతులు

అంగన్‌వాడీ టీచర్ మృతి

కేతేపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండపాలెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. గ్రామానికి చెందిన వంగూరి వెంకటమ్మ(46) కేతేపల్లిలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్న ఆమె గురువారం రాత్రి ఆరోగ్యం విషమించి గురువారం రాత్రి మృతి చెందింది. వెంకటమ్మకు భర్త, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వెంకటమ్మ మృతదేహాన్ని సీడీపీవో అంజుమ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు పొడిచేటి నాగమణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, కందాళ ప్రమీల, సీఐటీయూ, సీపీఎం నాయకులు సందర్శించి, నివాళులర్పించారు.

మత సామరస్యాన్ని కొనసాగిద్దాం

(5వ పేజీ తరువాయి)

పాటిస్తూ నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించామని, శోభాయాత్రతో పాటు, నిమజ్జనాన్ని కూడా ఇదేవిధంగా కొనసాగించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ గణేష్ శోభయాత్ర, నిమజ్జనాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా 2వేల మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, హనుమాన్ నగర్ గణేష్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు ఇటుకల కృష్ణయ్య, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కర్నాటి యాదగిరి, వెంకట్ నివాస్, చింతా సాంబమూర్తి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీలు గుమ్ముల మోహన్‌రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ప్రముఖులు

నల్లగొండ పట్టణంలోని హనుమాన్‌నగర్ 1వ నెంబర్ గణేష్ విగ్రహం వద్ద నిర్వహించిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి వేర్వేరుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ, సభావేదిక పైకి అన్ని పార్టీల వారిని పిలిచే సంప్రదాయాన్ని కాలరాసి మంత్రి ఒక్కరే ప్రొటోకాల్ పేరుతో వేదికపై ఉన్నా దైవకార్యం కాబట్టి తాము మిన్నకున్నామని, అయినా రెచ్చగొట్టేలా పోలీసులు తమను అడ్డుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ, నల్లగొండలో మంత్రి వెంకట్‌రెడ్డి సంప్రదాయాలను కాలరాస్తూ గణేష్ శోభాయాత్రను రాజకీయం చేయడం తగదని విమర్శించారు.

రూ.5లక్షలకు లడ్డూ కైవసం

హనుమాన్‌నగర్‌లోని 1వ నెంబర్ వినాయకుడి విగ్రహం లడ్డూ వేలం ఆసక్తికరంగా సాగింది. పోటాపోటీగా సాగిన వేలంలో ఇంజనీర్ బొడ్డుపల్లి సతీష్ రూ.5లక్షల116కు లడ్డూను దక్కించుకున్నారు. గత ఏడాది ఇదే లడ్డూను రూ.13లక్షల116కు నాగం వర్షిత్‌రెడ్డి కైవసం చేసుకున్నారు.

సమసమాజ నిర్మాణానికి గురువులు దిక్సూచి

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సమసమాజ నిర్మాణానికి గురువులు దిక్సూచి లాంటి వారని పెన్షనర్స్ అసోసియేషన్ నల్లగొండ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శి గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పెన్షనర్స్ భవనంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 15మంది పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, సుధాకర్, శేషారెడ్డి, కేశవాచారి, రవిప్రసాద్ రావు, అలీ, భిక్షం, రామలింగం, హుస్సేన్, రంగయ్య, శంకర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, చొల్లేటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: కాలానుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను మార్చుకోవాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాధన మధుసూదన్ కోరారు. చిట్యాలలో ట్రస్మా ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ప్రైవేట్‌పాఠశాలల ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్మా మండల అధ్యక్షుడు జమీరొద్దీన్, నాయకులు కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, పల్లె వినయ్‌కుమార్, ముక్కాముల రాంమోహన్, సుందర్ రాజ్, గట్టు అలెగ్జాండర్, కన్నెబోయిన శ్రీధర్, శంకర్, పెద్ది నరేందర్, ప్రకాష్ పాల్గొన్నారు.

చిట్యాలరూరల్:ఉరుమడ్లలోని బీసీ హాస్టల్‌లో గురుపూజోత్సవం నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు రవిశంకర్‌గురూజీ చిత్రపటానికి పూలమాల వేసి, విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. యోగా టీచర్ బుద్ధుడిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ప్రసాద్, మార్కెట్ డైరెక్టర్ కోనేటి యాదగిరి, బొడ్డు శ్రీను,ఎలిమినేటి మర్రిప్రసాద్‌రెడ్డి, పాకాల దినేష్, బోయ స్వామి, మేడబోయిన శ్రీనుయాదవ్, స్వామి, పల్లపు శివ, పల్లపు భరత్, నరేష్, మల్లేష్, సైదులు, స్వామి పాల్గొన్నారు.

మర్రిగూడ: శివన్నగూడంలో మాజీ సర్పంచ్ చెరుకు లింగం ఆధ్వర్యంలో సర్వేపల్లిరాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పిల్లలకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.

కనగల్: ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని యూత్ కాంగ్రెస్ నాయకుడు వరికుప్పల రవి అన్నారు. పర్వతగిరి ప్రాథమికోన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముత్తయ్య, హెచ్ఎం విజయ్‌ప్రసాద్, విజయ్‌కుమార్, స్వప్న, శ్రీదేవి, నర్సింహ, రమేష్‌గౌడ్, వెంకన్న ఉన్నారు.



చిట్యాలలో ప్రైవేటు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ట్రస్మా నాయకులు



కనగల్ మండలం పర్వతగిరిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

సొరంగం తవ్వకానికి గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

నిపుణులు అంచనాకు వచ్చారు. ఇక్కడ ఊటనీటిని తోడేందుకు మోటర్లకే ఏటా రూ.500కోట్ల వరకు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. తాజాగా ఈ మోటర్లతో పాటు, ఈ పనుల్లో ఉపయోగించే అన్ని విద్యుత్ పరికరాలు కొత్తవి సమకూర్చాలని నిర్ణయించారు. ఇక్కడ మిగిలి ఉన్న సుమారు 5కిలోమీటర్ల టన్నెల్‌ను టీబీఎంకి ప్రత్యామ్నాయంగా డీబీఎం (డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ మెథడ్) ద్వారా కొనసాగించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అందుకు సంబంధించి ప్రత్యామ్నాయంగా 13వ కిలోమీటర్ నుంచి ప్రస్తుత టన్నెల్‌కు కుడివైపున 100 మీటర్ల వరకు పక్కకు జరిగి, అపై అక్కడి నుంచి ఔట్‌లెట్ నుంచి టన్నెల్ కలిసేంతవరకు అవసరమైన మేర సొరంగాన్ని తవ్వనున్నట్లు పేర్కొంటున్నారు.

క్యాబినెట్‌లో ఆమోదం పొందే అవకాశం

మరోవైపున సొరంగమార్గంలో నిర్మిస్తున్న రెండు టన్నెల్స్ నడుమ డిండి నదిపై తెల్దేవర్‌పల్లి వద్ద నక్కలగండి (డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) రిజర్వాయర్‌లో ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ఫారెస్ట్‌కు చెందిన 281.93 హెక్టార్ల భూమి ముంపునకు గురవుతోంది. ఈ భూములను ప్రాజెక్టుకు కేటాయించేందుకు కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అందుకోసం ఇప్పటికే కేంద్ర అటవీశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారిక సంప్రదింపులు జరిగాయి. ఈ భూమిని కేంద్రం కేటాయిస్తే, దానికి బదులుగా రిజర్వ్‌ఫారెస్ట్ ఆవల నేరేడుగొమ్ము మండలంలోనే 790 హెక్టార్లలో అడవిని అభివృద్ధి చేసి ఇచ్చేందుకూ రంగం సిద్ధం చేశారు. ఈ అనుమతులు వేగంగా వచ్చేలా క్యాబినెట్‌లో ప్రభుత్వం దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది. మరోవైపు నక్కలగండి రిజర్వాయర్ నిర్మాణంతో చందంపేట మండలంలోని నక్కలగండి తండా, నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట మండలంలోని కేశ్యతండ, మర్లపాడుతండాలు ముంపునకు గురవుతాయి. 2015-16లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే ప్రకారం ఈ మూడు తండాల్లో 629 గిరిజన కుటుంబాలు నిర్వాసితులు అవుతుండడంతో వారికి పునరావాసం కల్పించాల్సి ఉంది. నక్కలగండి తండాకు సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించేందుకు చింతపల్లి మండలం నసర్లపల్లి వద్ద 10 ఎకరాల భూమిని పరిశీలించి అక్కడ ఆర్‌అండ్ ఆర్‌సెంటర్ నిర్మించాలని నిర్ణయించినా ఇంకా ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు. అటు నాగర్ కర్నూల్‌జిల్లా పరిధిలోని కేశ్యతండా, మర్లపాడు తండాలకు సంబంధించి పునరావాస కేంద్రాలను తొలుత సిద్ధాపురం వద్ద ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయిస్తే అందుకు నిర్వాసితులు అంగీకరించకపోవడంతో ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు సమీపంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. మొత్తంగా మూడు ముంపు తండాలకు పునరావాస కాలనీలు, ప్యాకేజీలపై క్యాబినెట్‌లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇంకో కీలకమైన పెండ్లిపాకల రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన భూసేకరణ, అక్కడ నిర్వాసితులయ్యే తండాల గిరిజనులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై, నక్కలగండి నుంచి పెండ్లిపాకల, అక్కడి నుంచి అక్కంపల్లి వరకు అవసరమైన కాల్వల నిర్మాణాలకు సైతం ఈ క్యాబినెట్‌లో ఆమోదం పొందాల్సి ఉంది. ఈ పనులన్నింటినీ ఏక సమయంలో కొనసాగించేందుకు కార్యాచరణ రూపొందించడంతో పాటు, నిధులను సైతం గ్రీన్‌ఛానల్‌లో అందుబాటులో ఉంచాలని, అప్పుడే ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పనులు పూర్తవుతాయనే అభిప్రాయాన్ని ఇంజనీరింగ్ వర్గాలు, స్థానిక ప్రజాప్రతినిధులు వ్యక్తం చేస్తున్నారు.

గట్టుప్పల్ శివాలయ పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గం

గట్టుప్పల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గట్టుప్పల్ శివాలయం పాలకకార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శ్రీ మాడ వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆలయ గౌరవ అధ్యక్షుడిగా మాదగోని సత్తయ్య గౌడ్, గౌరవ సలహాదారులుగా రాపోలు మధుసూదన్, శివాలయ దేవస్థాన కమిటీ అధ్యక్షుడిగా గంజి కృష్ణయ్య, కార్యనిర్వహాక అధ్యక్షుడిగా చెరిపెల్లి ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా కర్నాటి వెంకటేశం, బొల్లెపల్లి వెంకటేశం, భీమగాని మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా మోదుగు సత్తిరెడ్డి, కోశాధికారిగా బావండ్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా మోదుగు సత్తిరెడ్డి, కోశాధికారిగా బావండ్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా కర్నాటి సుధాకర్, సంగెపు శ్రీహరి, నీలం వెంకటేశం మరో 17మంది కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నామని జగన్నాథం, ముత్తారెడ్డి, పున్న కిషోర్, చిలుకూరు అంజయ్య, బండారు శ్రీరాములు, ఆనంద్ పాల్గొన్నారు.

దివ్యాంగుడికి బ్యాటరీ సైకిల్ అందజేత

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణ వెల్లెంల గ్రామానికి చెందిన దివ్యాంగుడు దేవిరెడ్డి ప్రతాప్‌రెడ్డికి రూ.40వేల విలువైన బ్యాటరీ సైకిల్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య గురువారం రాత్రి అందజేశారు. ప్రతాప్‌రెడ్డి పడుతున్న ఇబ్బందిని గ్రామస్థులు ఊశయ్య దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి బ్యాటరీ సైకిల్‌ను కొనుగోలు చేసి అందజేశాడు. కార్యక్రమంలో కోమటిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, నల్లబోతు సత్తయ్య, చిరుమర్తి ధర్మయ్య, గుత్తా నర్సిరెడ్డి, పల్లె నరేందర్ రెడ్డి, బొడిగె స్వామి, సోమనబోయిన మల్లయ్య, మోదుగు శేఖర్‌రెడ్డి, కల్లూరి నర్సింహ కొంపల్లి సైదులు, చిరుమర్తి అశోక్, మంద లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



బ్యాటరీసైకిల్‌ను అందజేస్తున్న ఊశయ్య

సాయుధ పోరాట వారోత్సవాలు జయప్రదం చేయాలి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనను అంతం చేయడానికి జరిగిన తెలంగాణా సాయుధ పోరాట వాస్తవాలను నేటి తరానికి తెలియజేప్పేందుకు ఈనెల 11 నుంచి 17 వరకు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే సదస్సులు, సెమినార్లను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం నార్కట్‌పల్లిలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ స్థాయి కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, వెట్టిచాకిరీ నుంచి విముక్తి పొందేందుకు జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో 4,500 మంది అమరులయ్యారని అన్నారు. వారిలో కేవలం సీపీఐ, ఆర్య సమాజానికి చెందిన వారే ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఆయా మండలాల పార్టీ కార్యదర్శులు పెండ్యాల శంకర్, ఎండీ అక్బర్, గౌనీ లక్ష్మీనర్సయ్య, వీ.రాజు, బొడిగె సైదులు, ప్రజా సంఘాల నాయకులు జిల్ల సత్యం, వెంపటి శ్రీనివాస్, వంగాల నాగయ్య, బోడ మల్లేశ్, దేవేందర్, శ్రీపతి స్వామి, నర్సింహ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కట్టంగూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పెంజర్ల సైదులు అన్నారు.మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మండల భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10న నకిరేకల్‌లో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు కత్తుల శంకర్, గద్దపాటి ఇస్తారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సైదులు

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.90 (308.7614)	52,360	52,360
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.90 (4.17)	2,426.7	1,290.06
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.292 (43.1584)	35,800	17,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.132 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220



నల్లగొండ పట్టణం వల్లభరావు చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు

బైబై గణేషా

అట్టహాసంగా నిమజ్జన శోభాయాత్ర

నల్లగొండ కల్చరల్ , సెప్టెంబరు 5: నవరాత్రుల పాటు పూజలందుకున్న గణేష్ విగ్రహాలను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అట్టహాసంగా శోభాయాత్రలు నిర్వహించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. అందంగా అలంకరించిన వాహనాలపై విగ్రహాలను ప్రతిష్ఠించి ఊరేగింపు నిర్వహించారు. శోభా యాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జై గణేషా.. జైజై గణేషా.. నినాదాలు, భజనలతో అంతటా భక్తిభావం వెల్లివిరిసిం ది. కళాకారుల వేషాధారణలు, నృత్యాలు, భక్తి పాటలు, కోలాటాలు, బాణాసంచా పేలుళ్ల మధ్య శోభాయాత్ర సాగింది. అర్ధరాత్రి దాటేవరకు విగ్రహాల నిమజ్జనం కొనసాగింది. నల్లగొండ పట్టణంలో వల్లభరావు చెరువలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

మత సామరస్యాన్ని కొనసాగిద్దాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండలో 1వ నెంబర్ విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో గంగా, జమునా, తెహజీబ్ సంస్కృతి, మత సామరస్యాన్ని కొనసాగిద్దామని, గత 30 ఏళ్లుగా ఎలాంటి ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు, నిమజ్జనం నిర్వహించుకోవడం సంప్రదాయంగా కొనసాగిస్తున్నామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ ఏడాది కూడా అదేరీతిలో శాంతియుతంగా శోభాయాత్రను కొనసాగించాలని, ప్రత్యేకించి యువత ఎక్కడా అత్యుత్సాహం ప్రదర్శించవద్దని కోరారు. గణేష్ నవరాత్రుల ముగింపు, శోభాయాత్ర ప్రారంభం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాతపట్టణం హనుమాన్ కాలనీలో ఏర్పాటు చేసిన 1వ నెంబర్ గణేష్ మండపం వద్ద వినాయక విగ్రహానికి నిర్వహించిన పూజల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలో మతసామరస్యం విలసిల్లుతోందని, అన్ని మతాలను పరస్పరం గౌరవించుకుంటూ అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. ఈ ఏడాది వినాయక మండపాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్‌ను అందించిందన్నారు. రూ.200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని ప్రారంభించామని, లతీఫ్ సాహెబ్ దర్గా గుట్ట, బ్రహ్మంగారి గుట్టలకు రూ.150కోట్లతో ఘాట్ రోడ్లు నిర్మిస్తున్నామని, 30శాతం పనులు కూడా పూర్తయ్యాయన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ అన్ని శాఖల సిబ్బంది, గణేష్ ఉత్సవ కమిటీల సహకారంతో క్రమశిక్షణను...

- మిగతా 8వ పేజీలో...

సొరంగం తవ్వకానికి గ్రీన్‌సిగ్నల్

- ఎస్ఎల్‌బీసీ పనులకు డెడ్‌లైన్ 2027
- సమీక్షలో సీఎం, మంత్రి నిర్ణయం
- అన్ని అనుమతుల కోసం ప్రత్యేక క్యాబినెట్ సమావేశం
- ఇన్‌లెట్ వైపు డీబీఎం పద్ధతిలో, అవుట్‌లెట్ వైపు టీబీఎం పద్ధతిలో పనులు

నల్లగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాకు జీవనరేఖగా పేర్కొంటున్న ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పనులను 2027, డిసెంబరు 9వ తేదీలోగా పూర్తిచేయాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. ఇన్‌లెట్ వైపు (శ్రీశైలం నుంచి నీరు తీసుకునే ప్రాంతం) పనులు పునః ప్రారంభించాక ఈ ఏడాది ఫిబ్రవరి 22న 14వ కిలోమీటర్ ప్రాంతంలో సొరంగం కుప్పకూలింది. దీంతో అప్పటినుంచి పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో పనులను తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా అత్యాధునిక హెలీబోర్న్ సర్వే నిర్వహించడం ద్వారా భవిష్యత్‌లో సొరంగ పనుల సందర్భంలో ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ పనులను 24 గంటలు కొనసాగించాలని నిర్ణయించారు. గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు నిర్ణయించారు. పనుల పర్యవేక్షణ, సొరంగమార్గం పూర్తికి తీసుకోవాల్సిన చర్యలను సూచించే నిమిత్తం మాజీ ఆర్మీ అధికారి, లెఫ్టినెంట్ జనరల్ హర్పాల్‌సింగ్‌ను నీటిపారుదలశాఖ ప్రత్యేక సలహాదారుగా నియమించారు. సొరంగమార్గం పూర్తిచేసే క్రమంలో శ్రీశైలం నుంచి అక్కంపల్లి రిజర్వాయర్ వరకు ఉన్న ఇతర సమస్యలన్నింటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల కోసం వారం రోజుల్లో ప్రత్యేక క్యాబినెట్ సమావేశం నిర్వహించి అన్ని అనుమతులు తీసుకోవాలని సైతం నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు కేవలం నల్లగొండ జిల్లాకే కాదని, యావత్ రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మకమని ఈ సందర్భంగా సీఎం వ్యాఖ్యానించడం ప్రాజెక్టు పనుల పునరుద్ధరణపై ప్రభుత్వం పట్టుదలగా ఉందని తెలుస్తోంది.

అవుట్‌లెట్ వైపు 3.545 కిలోమీటర్లు

మన్నేవారిపల్లి నుంచి (నీరు విడుదలయ్యే వైపు) చేపట్టిన అవుట్‌లెట్ టన్నెల్ 23.980 కిలోమీటర్లకు 20.435 కిలోమీటర్లు పూర్తవగా, ఇంకా 3.545 కిలోమీటర్లు మాత్రమే తవ్వాల్సి ఉంది. ఈ పనులను టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) ద్వారానే చేపట్టాలని నిర్ణయించారు. ఈ యంత్రం ఎలాంటి ఆటంకాలు లేకుండా పనిచేస్తే ఏడాది కాలంలో అవుట్‌లెట్ సొరంగం పనులు పూర్తిచేయవచ్చని ఎస్ఎల్‌బీసీ ఇంజనీర్లు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ యంత్రం ఆగడానికి కారణమైన 7మీటర్ల వ్యాసం, 37 మెట్రిక్ టన్నుల బరువు ఉండే బేరింగ్‌ను అమెరికా నుంచి తెప్పించారు. ఏడాది క్రితం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ బేరింగ్ తయారీ కంపెనీ ఉన్న అమెరికాకు వెళ్లి, బేరింగ్, ఇతర పరికరాలకు ఆర్డర్ కోసం రాబిన్‌సన్ కంపెనీతో అగ్రిమెంట్ చేయించారు. ఈ బేరింగ్ ఇప్పటికే పనిప్రదేశానికి చేరగా, ఇతర ఇన్‌స్టాలేషన్‌కు అవసరమైన సామగ్రి తెప్పించడానికి అవసరమైన నిధులు లేక బేరింగ్ ఇన్‌స్టాలేషన్ నిలిచింది.

ఈ వారంలో జరిగే క్యాబినెట్ సమావేశంలో ఈ సామగ్రి కొనుగోలుకు సైతం అనుమతులు తీసుకుంటారని, తద్వారా అవుట్‌లెట్ పనులను యుద్ధప్రాతిపదికన కొనసాగించేందుకు వీలవుతుందని అధికారులు చెబుతున్నారు.



క్యాబినెట్ సమావేశం ముగిశాక పనుల పునరుద్ధరణ

ఈ వారంలో నిర్వహించే క్యాబినెట్ సమావేశం ముగిసిన వెంటనే ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పనులను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించారు. ప్రమాదం జరిగిన ఇన్‌లెట్ వైపు డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇక్కడ మళ్లీ ప్రమాదం జరగకుండా నేషనల్ జియోగ్రాఫిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో అత్యాధునిక హెలీబోర్న్ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సర్వేతో ప్రమాదం జరిగే అవకాశముంటే ముందుగానే సంకేతాలు వస్తాయని, తద్వారా ముందస్తు చర్యలు తీసుకుంటూ పనులు వేగవంతంగా కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని ఇంజనీర్లు చెబుతున్నారు. ఇన్‌లెట్‌వైపు మొత్తం 19.500కిలోమీటర్ల టన్నెల్ తవ్వాల్సి ఉండగా, 13.935 కిలోమీటర్లు పూర్తయింది. ఫిబ్రవరిలో అక్కడి నుంచి పనులు తిరిగి ప్రారంభించగానే టన్నెల్ కుప్పకూలింది. 2019 నుంచి ఇక్కడ ఊటనీరు వచ్చిచేరుతుండడంతో పాటు, పనులు చేస్తున్నప్పుడు మట్టి, రాళ్లు కూలుతుండడంతో ముందుకు సాగలేదు. ఊటనీటిని తోడివేస్తూ, మట్టిని తొలగించడంతో పాటు, ఊటనీరు మళ్లీ రాకుండా, మట్టి, రాళ్లు పడకుండా ఉండేలా సిమెంట్, పాలియేరిథిన్‌తో గ్రౌటింగ్ చేయించారు. గ్రౌంటింగ్ చేస్తున్నప్పటికీ అది కప్పును బలంగా ఉంచలేకపోయిందని అందువల్లే టన్నెల్ కూలిందని

మిగతా 8వ పేజీలో...

దేశాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురువు గొప్పదనాన్ని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి చాటిచెప్పారని, ఆయన సేవలు మరువలేనివని అన్నారు. విద్యావ్యవస్థను పటిష్ఠం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర విద్యార్థులు ప్రపంచంతో పోటీపడేలా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోందన్నారు. నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ మాట్లాడుతూ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించేది గురువులేనని, అలాంటి గురువులు సమాజానికి ఆదర్శనీయులని కొనియాడారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, తాను కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న వెంటనే ప్రారంభమైన ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర మర్చిపోలేనిదని, అందుకు ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలని తెలిపారు. జిల్లాలో విద్యాభివృద్ధికి మైనింగ్ ద్వారా వచ్చే నిధుల్లో 70శాతం కేటాయించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల అంకితభావంతోనే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ అవార్డులతో నిమిత్తం లేకుండా ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్‌పై దృష్టిసారించాలన్నారు. అనంతరం జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన 208 మందిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు ఎస్పీ రమేష్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, డీఈవో భిక్షపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ హఫీజ్‌ఖాన్, హాలియా మార్కెట్‌కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై మంత్రి అసహనం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి ప్రసంగం ప్రారంభానికి ముందే ఉపాధ్యాయుల్లో సగం మందికి పైగా డైనింగ్ హాల్‌కు వెళ్లడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటన తనకు బాధ కలిగించిందని, ఎంపీ మాట్లాడిన తర్వాత తాను మాట్లాడతానని తెలిసినా, 50శాతం మందికిపైగా డైనింగ్ హాల్‌లో ఉండడం మనమంతా ఏ పరిస్థితిలో ఉన్నామో ఆలోచించుకోవాలన్నారు. కార్యక్రమం నుంచి తాను వెళ్లిపోయి ఉంటే తన గౌరవం పెరిగేదని, ఉపాధ్యాయుల గౌరవం తగ్గేదని, కానీ తాను అలా వెళ్లకుండా, యావత్ తెలంగాణ ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడానని పేర్కొన్నారు. అయితే అప్పటికే కార్యక్రమం జాప్యమవడంతో షుగర్, బీపీ వంటి సమస్యలతో బాధపడుతున్న వారు భోజనాలకు వెళ్లారే తప్ప, మంత్రిపై అగౌరవంతో కాదని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

మానవ సేవలో తరించిన మదర్ థెరిస్సా: మానవ సేవ కన్నా మిన్న ఏదీ లేదని చాటిన మహిళ మదర్ థెరిస్సా అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మదర్ థెరిస్సా వర్ధంతి సందర్భంగా మంత్రి క్యాంపు కార్యాలయం, ఇందిరా భవన్‌లో మదర్ థెరిస్సా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.




సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి

విజయ డెయిరీ లాభాల్లోకి రావడం అభినందనీయం

నల్లగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ నెల రూ.10కోట్ల నష్టాల్లో ఉన్న విజయ డెయిరీని ఆ సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ఏడాది కాలంలోనే లాభాల బాటలోకి తీసుకరావడం అభినందనీయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా గుత్తా అమిత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా సీఎంను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మరింత పట్టుదలతో పనిచేసి వచ్చిన లాభాలను పాడి రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం అమిత్‌రెడ్డి మాట్లాడుతూ, మరో ఏడాది కాలంలో విజయ డెయిరీ అమ్మకాలను పెంచి సమాఖ్యను పూర్తి లాభాల్లోకి తీసుకువస్తానని, అందుకు ప్రణాళికతో పనిచేస్తానన్నారు.

588.90 అడుగుల వద్ద సాగర్ నీటిమట్టం

నాగార్జునసాగర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం శుక్రవారం సాయంత్రం 588.90 అడుగులకు చేరింది. సాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 588.90 అడుగులు (308.7614 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 9,500 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 6,949 క్యూసెక్కుల నీటిని, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,211 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌నుంచి మొత్తం 52,360 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 52,360 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.



నిలకడగా మూసీకి ఇన్‌ఫ్లో

(ఆంధ్రజ్యోతి, కేతేపల్లి): మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల పరిధితోపాటు ఎగువ మూసీ నదీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో 10రోజులుగా ప్రాజెక్టుకు కొనసాగిన ఇన్‌ఫ్లో శుక్రవారం సాధారణ స్థితికి చేరింది. దీంతో ప్రాజెక్టు నాలుగు క్రస్టుగేట్లు ఎత్తి వరద నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్న అధికారులు శుక్రవారం ఒక క్రస్టుగేటును అడుగు మేర మాత్రమే ఎత్తి 770.71 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 2426.72 క్యూసెక్కులుగా నమోదైంది. వర్షాలు తగ్గుముఖం పట్టి ఇన్‌ఫ్లో పడిపోతున్న నేపథ్యంలో ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో అధికారులు ప్రాజెక్టు నీటిమట్టాన్ని క్రమంగా 645అడుగుల గరిష్ట స్థాయికి చేర్చే యత్నాలు చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 459.13 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645 అడుగు (4.46టీఎంసీ)ల నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.90అడుగు (4.17టీఎంసీ)లుగా ఉంది.

హైదరాబాద్ తరలిన జేపీవోలు



బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామపాలన అధికారులుగా ఎంపికైన జిల్లాకు చెందిన అభ్యర్థులు శుక్రవారం హైదరాబాద్‌కు తరలారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నుంచి నియామక పత్రాలు అందుకునేందుకు మూడు బస్సుల్లో వెళ్లారు. ఈ బస్సులకు ఎన్జీ కళాశాల మైదానంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేపీవోలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్ పరుశరాములు, తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాలను అభివృద్ధి చేయాలి

మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి



మెట్ల పనులను ప్రారంభిస్తున్న పాశం రాంరెడ్డి

తిప్పర్తి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాల్లో అభివృద్ధి జరగాలని మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. శుక్రవారం తిప్పర్తి మండల పరిధిలోని రామలింగాలగూడెం గ్రామంలో భక్త మార్కండేయస్వామి దేవస్థానం గుట్ట మెట్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహాశివరాత్రి సందర్భంగా దేవాలయాన్ని దర్శించుకున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని గుట్ట మెట్లకు సహకరించాలని స్థానిక నాయకులు విన్నవించారన్నారు. ఈ మేరకు మెట్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. హామీ మేరకు పనులు ప్రారంభించినట్లు చెప్పారు. అదేవిధంగా తన వంతుగా రూ.50వేలు దేవాలయ చైర్మన్‌కు అందజేశారు. కార్యక్రమంలో నల్లగొండ మార్కెట్‌కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, ముత్తినేని శ్యాంసుందర్, చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, సుధీర్, అంజయ్య, పాదూరి శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, మోష, రొట్టెల రమేష్, పాల్గొన్నారు.

కొండబీమనపల్లి ప్రాజెక్టులో నిమజ్జనం

దేవరకొండ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దేవరకొండలోనే గణేష్‌ను ఊరేగింపు అనంతరం కొండబీమనపల్లి ప్రాజెక్టులో నిర్వాహకులు నిమజ్జనం చేశారు. మున్సిపల్ కమిషనర్ సుదర్శన్, త హసీల్దార్ మధుసూదన్ రెడ్డి, సీఐ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు క్రేన్‌లను ఏర్పాటు చేసి గణేష్‌లను నిమజ్జనం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రాజెక్టు వద్ద పడవులు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.

రూ. 1.01 లక్షలు పలికిన లడ్డూ

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేటలో నిర్వహించిన ఉత్సవాల్లో స్వామి వారి ప్రసాదాన్ని దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. కాలనీకి చెందిన ఎన్నారై పులిజాల హరిణి లడ్డూప్రసాదాన్ని వేలంపాటలో రూ. 1,01,116కు దక్కించుకున్నారు. కార్యక్రమాలలో నీరుకంటి నారాయణ, సావిత్రి, మాజీ కౌన్సిలర్ చిలుకూరి రమాదేవి, పసుపులేటి శివ, ఎం. వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

వినాయకా.. సెలవిక!

● ఆనందోత్సాహాల నడుమ గణేష్ నిమజ్జనోత్సవాలు ● దేవరకొండలో నిరసన ● ట్రాఫిక్ జామ్




దేవరకొండలో మహిళల కోలాట ప్రదర్శన, మిర్యాలగూడలో నిమజ్జన యాత్రకు బయలుదేరిన వినాయకుడు

దేవరకొండ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలో గణేష్ నిమజ్జన వేడుకలను కనుల పండువగా శుక్రవారం నిర్వహించారు. మొదటగా 10.30 గంటలకు పెద్ద రామాలయంలోని వినాయకుడికి ఆలయ కమిటీ నిర్వాహకులతోపాటు, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమాణా రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అలంపల్లి నరసింహ, డాక్టర్ వేణుధర్ రెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద రామాలయంలోని గణేష్‌ను వద్ద లడ్డూ వేలం పాటలో పాడి రూ.66,116 లకు ఏ.నరేందర్ దక్కించుకున్నారు. అనంతరం గణేష్ శోభాయాత్రను ప్రారంభించారు. శోభాయాత్ర దేవరకొండ పట్టణంలో పాత రామాలయం, ఖిల్లాబజార్, ముత్యాలమ్మ బజార్, గాంధీబజార్ తహసీల్దార్ కార్యాలయం రోడ్డు మీదుగా సాయింత్రం ప్రధాన రహదారిపైకి చేరుకుంది. కొండబీమనపల్లి ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు కోలాటలు, భజనలు, భక్తి పాటల మధ్యన వైభవంగా శోభాయాత్ర కొనసాగింది. దేవరకొండ ఏఎస్పీ మౌనిక ఆధ్వర్యంలో సీఐ వెంకట్‌రెడ్డి, డిండి రూరల్ సీఐ బీసన్నతోపాటు డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, ప్రత్యేక బలగాలతో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో గణేష్ నిర్వాహకులు పగిడిమరి రఘురాములు, నక్క వెంకటేష్ యాదవ్, నేతాల వెంకటేష్, పానగంటి మల్లయ్య, వెంకటేశ్వర్లు బెజవాడ శేఖర్, వస్కూల సుధాకర్, పున్న వెంకటేష్ భక్తులు పాల్గొన్నారు.

దేవరకొండలో ధర్నా, రాస్తారోకో

నిమజ్జనోత్సవం చేస్తుండగా, సౌండ్ బాక్స్‌లను పోలీసులు తొలగించడంతో గణేష్ ఉత్సవ సమితి, ఆర్యవైశ్య సంఘం నాయకులు దేవరకొండ మీనాక్షి సెంటర్ వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్ స్తంభించడంతో విషయం తెలుసుకున్న దేవరకొండ ఏఎస్పీ మౌనిక ఘటనాస్థలానికి చేరుకొని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

కన్నుల పండువగా..

కొండమల్లేపల్లి: తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథులు నిమజ్జనానికి తరిలారు. ఈ సందర్భంగా కొండమల్లేపల్లిలో గణనాథుల శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ నాయిని మాధవరెడ్డి, కమిటీ సభ్యులు కేసాని లింగారెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, బూడిద వెంకటయ్యయాదవ్, బుచ్చిరెడ్డి, మల్లేష్‌యాదవ్, శంకర్‌గౌడ్, ఆలయ పూజారి పాల శివయ్య శర్మ పాల్గొన్నారు.



మిర్యాలగూడలో వినాయకుల శోభాయాత్రలో మహిళలు

వేములపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శుక్రవారం నిర్వహించిన స్వామివారి లడ్డూ వేలం పాటలో భక్తులు పోటీపడ్డారు. కాగా గ్రామానికి చెందిన గుండెబోయిన వెంకటయ్య రూ.1,15,1500కు పాడి లడ్డూను దక్కించుకున్నారు.



పీఏపల్లిలో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళా భక్తులు

అన్నదానాలు.. కుంకుమార్చనలు

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు శుక్రవారం పీఏపల్లి, గుడిపల్లి మండలాల్లోని వివిధ ప్రాంతాల్లోగల వినాయక మండపాల్లో అన్నదానం, కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. మండలకేంద్రంలో, రెడ్డిస్ కాలనీలో కొలువుదీరిన గణనాథుని మండపం వద్ద ఘనంగా కుంకుమార్చన నిర్వహించారు. అదేవిధంగా గుడిపల్లి మండలంలోని నీలంనగర్ వద్ద కూన్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డి-అనూష దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలవ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు వైభవంగాసాగాయి. గణేష్ విగ్రహాలు శుక్రవారం మధ్యాహ్నం నుంచి అజ్మాపురం సాగర్ బ్యాక్ వాటర్, ఘనపురం వద్ద గల ఉదయ సముద్రం కెనాల్ వద్ద క్యూ కట్టాయి. జై బోలో గణేష్ మహరాజుకి జై అంటూ విగ్రహాలను తరలించారు.

విఘ్నాలు తీర్చే వినాయకుడు

● మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విఘ్నాలు తొలగించేవాడే వినాయకుడని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ప్రతి ఏటా కులమతాలకతీతంగా పండుగలు జరుపుకోవడం హర్షనీయమన్నారు. ప్రజల కష్టాలు తీర్చి సుఖసంతోషాలను ప్రసాదించాలని మహాగణపతిని వేడుకున్నట్లు తెలిపారు. రెడ్డీకాలనీ రామాలయంలో ప్రతిష్ఠించిన మట్టి వినాయక విగ్రహాన్ని అదే ప్రాంగణంలో నిమజ్జనం చేసి, ఆ మట్టిలో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో శేఖర్‌రెడ్డి, సత్యం, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమం

మిర్యాలగూడ పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలకు కేంద్రబిందువైన గణేష్ మార్కెట్‌లో నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో నిర్వహించిన శోభాయాత్రకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలతో సుమారు అర కిలోమీటరు పొడవైన భక్తుల ర్యాలీతో పట్టణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. నిమజ్జన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్వామి వారి ఊరేగింపు వాహనాన్ని స్వయంగా నడుపుతూ భక్తులలో ఉత్సాహం నింపడం విశేషం.

ప్రజలందరినీ ఏకం చేసిన ఏకదంతుడు

● ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏకదంతుడు ప్రజలందరినీ ఏకం చేస్తాడని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో నిర్వహించిన పూజ, అన్నదాన, నిమజ్జన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమాన్‌పేటలో మాట్లాడుతూ చిన్నా, పెద్దలందరూ కలిసి ఉత్సాహంగా జరుపుకునే పండుగే వినాయకోత్సవమన్నారు. నవరాత్రి ఉత్సవాల చివరి రోజున భక్తులకు నారాయణ కుమార్తెలు ఉమాప్రవీణ్, రమ అన్నదానం ఏర్పాటు చేశారు.



పూజల్లో పాల్గొన్న శంకర్‌నాయక్

కార్మికులను క్రమబద్ధీకరించాలి

● కేవీపీఎస్ జిల్లా నేత నాగార్జున



నిరసనలో పాల్గొన్న కార్మికులు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న నాట్కో ఫార్మా కంపెనీలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించాలని కేవీపీఎస్ (కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం) జిల్లా నేత దొంతాల నాగార్జున డిమాండ్ చేశారు. రెండు రోజులుగా నాట్కో ఫార్మా కంపెనీ ఎదుట నిరసన చేస్తున్న కార్మికులకు కేవీపీఎస్ నాయకులు శుక్రవారం మద్దతు తెలిపి మాట్లాడారు. 20 ఏళ్లుగా నాట్కో ఫార్మాలో పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించకుండా నిన్న, మొన్న వచ్చిన కార్మికులను క్రమబద్ధీకరించడం ఎంత వరకు సమంజసమన్నారు. నాట్కోలో పనిచేస్తున్న క్యాజువల్ కార్మికుల్లో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఉన్నారని తెలిపారు. 20 ఏళ్లుగా ఇదే కంపెనీని నమ్ముకొని చాలీచాలని వేతనాలతో బతుకుతున్న కార్మికులను తక్షణమే క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో అనిల్, శ్రీను, అంజి, రాములు, వెంకట్, రంగా, మంగ, శాంతి, రిబ్కా, దేవి, ఖాజా మియా, నాగు, బాబురావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ పాదాల పంపిణీ రేపు

మిర్యాలగూడ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఈ నెల 7న ఉచిత కృత్రిమ పాదాల పంపిణీ చేయనున్నట్లు రోటరీ క్లబ్ ఛైర్మన్ రేపాల అంతయ్య, కోఆర్డినేటర్లు గౌరు దయాకర్, రంగా హరినాథ్ తెలిపారు. శుక్రవారం వారు స్థానికంగా మాట్లాడుతూ ఏకం యూఎస్ఏ ఆర్థిక సహాయంతో ఖమ్మం రోటరీ క్లబ్ నేతృత్వంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంలో కాలు కోల్పోయిన 110 మంది దివ్యాంగుల పాదాల సైజులను జూలై నెలలో సేకరించినట్లు చెప్పారు. సెప్టెంబరు 7న మిర్యాలగూడ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో కృత్రిమ పాదాల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దివ్యాంగులు ఉదయం 10గంటల వరకు కార్యక్రమానికి హాజరై కృతిమ పాదాలు అమర్చుకోవాలన్నారు. రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు, రైస్‌మిల్లర్ అసోసియేషన్ సభ్యులు హాజరవుతున్నట్లు తెలిపారు.

మత సామరస్యాన్ని కొనసాగిద్దాం

(5వపేజీ తరువాయి)

పాటిస్తూ నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించామని, శోభాయాత్రతో పాటు, నిమజ్జనాన్ని కూడా ఇదేవిధంగా కొనసాగించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ గణేష్ శోభయాత్ర, నిమజ్జనాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా 2వేల మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, మునిసిపల్ మాజీ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, హనుమాన్ నగర్ గణేష్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు ఇటుకల కృష్ణయ్య, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కర్నాటి యాదగిరి, వెంకట్ నివాస్, చింతా సాంబమూర్తి, మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీలు గుమ్ముల మోహన్‌రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ప్రముఖులు

నల్లగొండ పట్టణంలోని హనుమాన్‌నగర్ 1వ నెంబర్ గణేష్ విగ్రహం వద్ద నిర్వహించిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి వేర్వేరుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ, సభావేదిక పైకి అన్ని పార్టీల వారిని పిలిచే సంప్రదాయాన్ని కాలరాసి మంత్రి ఒక్కరే ప్రొటోకాల్ పేరుతో వేదికపై ఉన్నా దైవకార్యం కాబట్టి తాము మిన్నకున్నామని, అయినా రెచ్చగొట్టేలా పోలీసులు తమను అడ్డుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ, నల్లగొండలో మంత్రి వెంకట్‌రెడ్డి సంప్రదాయాలను కాలరాస్తూ గణేష్ శోభాయాత్రను రాజకీయం చేయడం తగదని విమర్శించారు.

రూ.5లక్షలకు లడ్డు కైవసం

హనుమాన్‌నగర్‌లోని 1వ నెంబర్ వినాయకుడి విగ్రహం లడ్డు వేలం ఆసక్తికరంగా సాగింది. పోటాపోటీగా సాగిన వేలంలో ఇంజనీర్ బొడ్డుపల్లి సతీష్ రూ.5లక్షల116కు లడ్డూను దక్కించుకున్నారు. గత ఏడాది ఇదే లడ్డును రూ.13లక్షల116కు నాగం వర్షిత్‌రెడ్డి కైవసం చేసుకున్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

మిర్యాలగూడ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని సామాజికవేత్త రాజు, బీసీ జేఏసీ మిర్యాలగూడ కన్వీనర్ మారం శ్రీనివాస్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో బీసీ భవన్‌లో ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సమాజంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. తరగతి గదుల్లో దేశ భవిష్యత్ రూపుదిద్దుకుంటుందన్నారు. విద్యార్థులను రేపటి పౌరులుగా తీర్చిదిద్ది నూతన సమాజ నిర్మాణానికి టీచర్స్ తోడ్పడతారన్నారు. సామాజిక మార్పునకు కృషి చేస్తారన్నారు. ఉపాధ్యాయులు దశరథనాయక్, సైదులు, చంద్రయ్య, చందు, అంజయ్య అరుణ. మంగమ్మలను సన్మానించారు. కార్యక్రమంలో బీసీ జేఏసి నాయకులు కోల సైదులు, దాసరాజు జయరాజు, మురళీ, గోపినాయక్, శ్రీనివాస్ బానని గిరి తదితరులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా లయన్స్ కంటి వైద్యశాలలో ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈవోలు బాలు, లక్ష్మణ్‌నాయక్, బాలాజీనాయక్, వెంకన్న, రవిలతోపాటు 30 మంది స్థానిక ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్, బిఎం.నాయుడు, కార్యదర్శి కూటాల రాంబాబు, ముక్కపాటి వెంకటేశ్వర్లు, కర్నాటి రమేష్, యనగండ్ల లింగయ్య, కంచర్ల అనంతరెడ్డి, డా.జాడి రాజు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యారంగంలో ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులను లయన్స్ కంటి ఆస్పత్రి ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. వాసవీ, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో గురువులను సన్మానించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సామాజిక కార్యకర్త జాడి రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుడంటే పాఠాలు చెప్పే వ్యక్తి కాదని, విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంటూ సమాజాభివృద్ధిలో భాగస్వామ్యుడన్నారు. కార్యక్రమాల్లో క్యామ వెంకటేశం, రమాదేవి, ఏచూరి భాగ్యలక్ష్మి, మురహరి, బికుమళ్ల కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవోలను సన్మానిస్తున్న లయన్‌క్లబ్ సభ్యులు

● జనయిత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మునీర్ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుల పాత్ర గొప్పదన్నారు. గురువులను పూజించి, గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు బాలు, బాలాజీనాయక్, మధుసూధన్‌రెడ్డి, శ్రీపతి శ్రీనివాస్, కృష్ణకాంత్‌నాయక్, వీటీ, రత్నం తదితరులు పాల్గొన్నారు. కాగా కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన గురు పూజోత్సవంలో ప్రిన్సిపాల్ భీమార్జున్‌రెడ్డి, డాక్టర్ నరేష్ గుమ్మడి, వెంకటరమణ, నాగరాజు తదదితరులు పాల్గొన్నారు. బీసీభవన్‌లో జేఏసీ నాయకులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మారం శ్రీను, చేగొండి మురళి, సైదులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ : దేవరకొండ రిటైర్డ్ ఉద్యోగ సంఘ భవనంలో మాజీ రాష్ట్రపతి దివంగత సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి రిటైర్డ్ ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తాటిశెట్టి నర్సింహ, అంకం చంద్రమౌళి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా, భారత రాష్ట్రపతిగా రాధాకృష్ణన్ మహోన్నత సేవలు అందించాడని గుర్తుచేశారు. ఆయన పుట్టినరోజునే ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు ఐజాగ్, పాండరయ్య, పురుషోత్తం, సత్యమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.



దేవరకొండ: సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

గుండెపోటుతో జర్నలిస్టు మృతి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన సీనియర్ రిపోర్టర్ దండ భాస్కర్(50) గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం ఛాతినొప్పితో బాధపడుతున్న భాస్కర్‌ను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మీడియారంగంలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న భాస్కర్ ప్రస్తుతం ఓ టీవీఛానెల్‌లో పనిచేస్తున్నాడు. సీటి కేబుల్‌లో రిపోర్టర్, న్యూస్ రీడర్‌గా పనిచేసిన భాస్కర్‌ను పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సిటీకేబుల్ భాస్కర్‌గా పిలుస్తుంటారు. ఆయన మృతికి మీడియా ప్రతినిధులు, రాజకీయనాయకులు, పట్టణ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ

● బంకాపురంలో డీజే వాహనం సీజ్



సీజ్ చేసిన డీజే వాహనంతో నిర్వాహకుడు

నిడమనూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చట్టాన్ని ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిడమనూరు ఎస్ఐ ఉప్పు సురేష్ హెచ్చరించారు. మండలంలోని బంకాపురం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా చట్టాన్ని ఉల్లంఘించి డీజే సౌండ్ బాక్స్‌లు పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించినందున గురువారం రాత్రి డీజే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు డీజే ఆపరేటర్లు, నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంకాపురం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పోలీసుల సూచనలు ధిక్కరించి ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా డీజే సౌండ్ బాక్స్ ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఇబ్బంది కలిగిందన్నారు. సమాచారం తెలయడంతో డీజే ఆపరేటర్లు సతీష్, రవికుమార్‌తో పాటు ఆర్గనైజర్ అఖిల్ రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డీజే వాహనాన్ని కూడా సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

చింతపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చింతపల్లి ఎస్ఐ రాంమూర్తి అన్నారు. వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని మొద్దుల మల్లేపల్లిలో జై శ్రీరాం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి ముద్దం బుచ్చమ్మ కృష్ణయ్య, మల్లేష్ గౌడ్, శివ, అంజి, స్వామి, గండు శ్రీను, వెంకటయ్య, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐని సన్మానిస్తున్న నిర్వాహకులు

సొరంగం తవ్వకానికి గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

నిపుణులు అంచనాకు వచ్చారు. ఇక్కడ ఊటనీటిని తోడేందుకు మోటర్లకే ఏటా రూ.500కోట్ల వరకు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. తాజాగా ఈ మోటర్లతో పాటు, ఈ పనుల్లో ఉపయోగించే అన్ని విద్యుత్ పరికరాలు కొత్తవి సమకూర్చాలని నిర్ణయించారు. ఇక్కడ మిగిలి ఉన్న సుమారు 5కిలోమీటర్ల టన్నెల్‌ను టీబీఎంకి ప్రత్యామ్నాయంగా డీబీఎం (డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ మెథడ్) ద్వారా కొనసాగించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అందుకు సంబంధించి ప్రత్యామ్నాయంగా 13వ కిలోమీటర్ నుంచి ప్రస్తుత టన్నెల్‌కు కుడివైపున 100 మీటర్ల వరకు పక్కకు జరిగి, ఆపై అక్కడి నుంచి ఔట్‌లెట్ నుంచి టన్నెల్ కలిసేంతవరకు అవసరమైన మేర సొరంగాన్ని తవ్వనున్నట్లు పేర్కొంటున్నారు.

పనులన్నింటికీ క్యాబినెట్‌లో ఆమోదం పొందే అవకాశం

మరోవైపున సొరంగమార్గంలో నిర్మిస్తున్న రెండు టన్నెల్స్ నడుమ డిండి నదిపై తెల్దేవర్‌పల్లి వద్ద నక్కలగండి (డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) రిజర్వాయర్‌లో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ఫారెస్ట్‌కు చెందిన 281.93 హెక్టార్ల భూమి ముంపునకు గురవుతోంది. ఈ భూములను ప్రాజెక్టుకు కేటాయించేందుకు కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అందుకోసం ఇప్పటికే కేంద్ర అటవీశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారిక సంప్రదింపులు జరిగాయి. ఈ భూమిని కేంద్రం కేటాయిస్తే, దానికి బదులుగా రిజర్వ్‌ఫారెస్ట్ అవల నేరేడుగొమ్ము మండలంలోనే 790 హెక్టార్లలో అడవిని అభివృద్ధి చేసి ఇచ్చేందుకూ రంగం సిద్ధం చేశారు. ఈ అనుమతులు వేగంగా వచ్చేలా క్యాబినెట్‌లో ప్రభుత్వం దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది. మరోవైపు నక్కలగండి రిజర్వాయర్ నిర్మాణంతో చందంపేట మండలంలోని నక్కలగండి తండా, నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట మండలంలోని కేశ్యతండ, మర్లపాడుతండాలు ముంపునకు గురవుతాయి. 2015-16లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే ప్రకారం ఈ మూడు తండాల్లో 629 గిరిజన కుటుంబాలు నిర్వాసితులు అవుతుండడంతో వారికి పునరావాసం కల్పించాల్సి ఉంది. నక్కలగండి తండాకు సంబంధించి ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మించేందుకు చింతపల్లి మండలం నసర్లపల్లి వద్ద 10 ఎకరాల భూమిని పరిశీలించి అక్కడ ఆర్‌అండ్‌ఆర్‌సెంటర్ నిర్మించాలని నిర్ణయించినా ఇంకా ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు. అటు నాగర్‌కర్నూల్‌జిల్లా పరిధిలోని కేశ్యతండా, మర్లపాడుతండాలకు సంబంధించి పునరావాస కేంద్రాలను తొలుత సిద్ధాపురం వద్ద ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయిస్తే అందుకు నిర్వాసితులు అంగీకరించకపోవడంతో ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు సమీపంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. మొత్తంగా మూడు ముంపు తండాలకు పునరావాస కాలనీలు, ప్యాకేజీలపై క్యాబినెట్‌లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇంకో కీలకమైన పెండ్లిపాకల రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన భూసేకరణ, అక్కడ నిర్వాసితులయ్యే తండాల గిరిజనులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీపై, నక్కలగండి నుంచి పెండ్లిపాకల, అక్కడి నుంచి అక్కంపల్లి వరకు అవసరమైన కాల్వల నిర్మాణాలకు సైతం ఈ క్యాబినెట్‌లో ఆమోదం పొందాల్సి ఉంది. ఈ పనులన్నింటినీ ఏక సమయంలో కొనసాగించేందుకు కార్యాచరణ రూపొందించడంతో పాటు, నిధులను సైతం గ్రీన్‌ఛానల్‌లో అందుబాటులో ఉంచాలని, అప్పుడే ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పనులు పూర్తవుతాయనే అభిప్రాయాన్ని ఇంజనీరింగ్ వర్గాలు, స్థానిక ప్రజాప్రతినిధులు వ్యక్తం చేస్తున్నారు.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : వార్-2, వెంకటేశ్వర: మహావతార్ నరసింహ రాఘవ: కూలీ, విక్రోస్: కూలీ, పరదా, బన్ బటర్ జామ్ దేవరకొండ : మనోజ్ : వార్ 2 మైత్రి వెంకటేశ్వర : మహా అవతార్ నర్సింహ